# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com


**నమ్మలేని నిజాలు**

యుద్ధం ఆగింది
మరణాలు అనల్పం
బందీలు స్వల్పం

కిడ్నీ అంగడి
ధరనుబట్టి గ్రూపు
జీవ వ్యాపారం

బాధ నవ్వులు
మనసు కవాటాలు
రక్త స్పందన

అర్థ నేరాలు
నగరంలో ఘోరాలు
భయంతో జనం.

హామీల ఒట్టు
ఓటు కొరకే పెట్టు
అసుర హస్తం.



- రేడియమ్
సెల్: 9291527757

**శ్రీనిజాలు**

మూగపసి బాలుడు మీద
వీధి కుక్కల దాడి !
అరవలేక పడిపోగా
పీక్కొని తిన్న బాడి !
ఇరవై కుక్కలు కరిచిన
పాపం పసివాడు !
ఇదేం కాలమిదేమిటని
ప్రశ్నించేది ఎవడు !



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245


హైదరాబాద్ గురువారం 4-12-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:95 పేజీలు:6 వెల: రూ.1/-


## జర్నలిస్టుల సమస్యలపై టీయూడబ్ల్యూజే

# మహాధర్నా విజయవంతం




మహా ధర్నాలో ప్రసంగిస్తున్న జర్నలిస్టు నాయకుడు విరాహత్ అలీ.




ధర్నాలో పాల్గొన్న మహిళా జర్నలిస్టులు




సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ జగన్‌కు వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు








హైదరాబాద్, డిసంబర్ 3 (నేటినిజం ప్రతినిధి): జర్నలిస్టుల సమస్యల పరిష్కారం చేయాలనే ప్రధాన డిమాండ్‌తో టీయూ డబ్ల్యూజే ఆధ్వర్యంలో సమాచార శాఖ ప్రధాన కార్యాలయం వద్ద జర్నలిస్ట్‌లు మహా ధర్నా నిర్వహించారు. అధ్యక్షులు విరాహత్ అలీ అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమంలో తెలంగాణ వ్యాప్తంగా జర్నలిస్ట్‌లు హాజరు కాగా యూనియన్ నాయకులు దేవులపల్లి అమర్, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డిలు పాల్గొని సంఘీభావం తెలిపారు. ధర్నా అనంతరం జర్నలిస్ట్ సంఘం నాయకులు సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ జగన్‌కు పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

అక్రిడియేషన్ పాలసీని వెంటనే ప్రకటించి కొత్త కార్డులు జారీ చేయాలని, ఆరోగ్య భీమా పథకాన్ని వెంకటనే పునరుద్ధరించాలని, అర్హులైన జర్నలిస్ట్‌లకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, వృత్తి కమిటీలు వెంటనే ఏర్పాటు చేయాలని, సంక్షోభంలో ఉన్న చిన్న, మధ్య తరగతి పత్రికలను ఆదుకోవాలనే ప్రధాన డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

## 80 వేల మంది చూస్తుండగానే.. 13 ఏండ్ల బాలుడితో హంతకుడిని కాల్చి చంపించిన తాలిబన్లు

న్యూఢిల్లీ, డిసంబర్ 3: ఆఫ్ఘనిస్థాన్ లో తాలిబన్లు విధించే శిక్షలు ఎంత కఠినంగా ఉంటాయో అందరికీ తెలిసిందే. తాలిబన్లు విధించిన చట్టాలను వ్యతిరేకించినా.. లేదంటే నేరాలకు పాల్పడిన వారికి బహిరం గంగానే ఉరితీస్తారు. తాజాగా ఒకే కుటుంబంలో 13 మందిని దారుణంగా చంపిన వ్యక్తికి తాలిబన్లు విధించిన శిక్ష ఇప్పుడు చర్చనీయాంశ మవుతోంది.

ఖోస్ట్ ప్రావిన్స్‌లో కొన్ని నెలల క్రితం తొమ్మిది మంది పిల్లలు సహా ఒకే కుటుంబానికి చెందిన 13 మందిని ఓ వ్యక్తి అతికిరా తంగా హత్య చేశాడు. ఈ కేసును విచారించిన సుప్రీంకోర్టు.. నింది తుడికి మరణ శిక్ష విధించింది. కోర్టు తీర్పుతో తాలిబన్ పాలకులు హంతకుడికి బహిరంగంగా మరణ శిక్ష అమలు చేశారు. సుమారు 80 వేల మంది చూస్తుండగానే బాధిత కుటుంబంలోని 13 ఏండ్ల బాలుడితో హంతకుడిని అతికిరాతంగా కాల్చి చంపించారు. ఈ వ్యవహారం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. హంతకుడిని మంగల్‌గా గుర్తించారు.

# ప్రధాని మోదీతో సీఎం రేవంత్‌రెడ్డి కీలక భేటీ..



న్యూఢిల్లీ, డిసంబర్ 3:తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఢిల్లీలో పర్యటిస్తున్నారు. ఇవాళ(బుధవారం) పలు కార్యక్రమాల్లో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీతో ముఖ్యమంత్రి సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ -2047 గ్లోబల్ సమ్మిట్‌కు రావాలంటూ ప్రధాని మోదీని ప్రత్యేకంగా ఆహ్వానించారు. పార్లమెంట్‌లో ప్రధానితో జరిగిన ఈ భేటీలో సీఎంతో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, తదితరులు ఉన్నారు.

ఈ సందర్భంగా ప్రత్యేకంగా ముద్రించిన గ్లోబల్ సమ్మిట్ ఆహ్వాన పత్రికను ప్రధానికి అందజేశారు ముఖ్యమంత్రి. కేంద్ర ప్రభుత్వం ఎంచుకున్న వికసిత్ భారత్ -2047 లక్ష్యాలకు అనుగుణంగా .. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వృద్ధి లక్ష్యంగా తెలంగాణ భవిష్యత్తు సంకల్పంతో ముందుకు సాగుతోందని ప్రధానికి వివరించారు. దీనికి అనుగుణంగా అన్ని రంగాల వృద్ధి లక్ష్యాలు, అనుసరించే భవిష్యత్తు ప్రణాళికలను విశ్లేషించేలా తెలంగాణ రైజింగ్ -2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించినట్లు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పుకొచ్చారు. నీతి అయోగ్ సలహాలు, సూచనలతో పాటు అన్ని రంగాల నిపుణుల మేథో మథనంతో తయారు చేసిన ఈ విజన్ డాక్యుమెంట్‌ను గ్లోబల్ సమ్మిట్‌లో ఆవిష్కరిస్తున్నట్లు ప్రధాని మోదీకి తెలిపారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. ఐదుగురు మావోయిస్టులు మృతి

హైదరాబాద్, డిసంబర్ 3:ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం కాల్పుల మోతతో దద్దరిల్లింది. బీజాపూర్ అడవుల్లో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు చోటు చేసుకు న్నాయి. ఈ ఎన్‌కౌంటర్ లో ఐదుగురు మావోలు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్, స్పెషల్ టాస్క్ ఫోర్స్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది బుధవారం ఉదయం బస్తర్ డివిజన్‌లోని అటవీ ప్రాంతంలో నక్సలైట్ వ్యతిరేక ఆపరేషన్ చేపట్టారు. అక్కడ మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మరణించారు. ఘటనాస్థలి వద్ద భారీగా ఆయు ధాలు, పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ కొనసాగుతోంది.

## రైల్వే స్టేషన్‌లో బాంబు పేలుడులో కుట్ర లేదు: జిల్లా ఎస్పీ

కొత్తగూడెం, డిసెంబర్ 03: కొత్తగూడెం రైల్వేస్టేషన్ (భద్రాచలం రోడ్డు)లో నాటు బాంబు పేలుడు ఘటనలో ఎలాంటి కుట్ర కోణం లేదని జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ వెల్లడించారు. బుధవారం జిల్లా ఎస్పీ రోహిత్ కుమార్ విలేకర్లతో మాట్లాడుతూ.. అడవి జంతువుల కోసం ఈ నాటుబాం బులు వినియోగిస్తున్నారని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు ఈ బాం బులు ఉన్న సంచులను చెత్త కుప్ప లో పడేశారని వివరించారు. ఆ సంచులను వీధి కుక్కలు రైల్వే ట్రాక్‌పై తీసుకువచ్చి.. అందు లోని వస్తువులను తినే ప్రయ త్నం చేశాయని చెప్పారు. ఆ క్రమంలో నాటు బాంబు పేలుడు సంభవించిందని పేర్కొన్నారు.

## సంచార్ సాథీతో నిఘాకు తావే లేదు.. లోక్‌సభలో సింధియా

న్యూఢిల్లీ, డిసంబర్ 3:భారత్‌లో విక్రయించే ఫోన్లలో ముందుగానే 'సంచార్ సాథీ' యాప్ ఇన్‌స్టాల్ చేసి ఇవ్వాలనే కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు దుమారం రేపుతుండటంతో కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి జ్యోతిరాదిత్య సింధియా మరో సారి స్పష్టత ఇచ్చారు. ఈ యాప్‌తో స్నూపింగ్ సాధ్యం కాదని బుధవారంనాడు లోక్‌సభలో వివరించారు.

సంచర్ సాథీ యాప్‌తో వ్యక్తిగత జీవితాలపై నిఘా పెడుతున్నారంటూ ఎంపీలు ఆందోళన వ్యక్తం చేయడంతో మంత్రి స్పందిస్తూ, వినియోగదారులు అక్కర్లేదనుకుంటే యాప్‌ను డిలీట్ చేయవచ్చని, యాక్టివేట్ చేసుకోకుంటే సరిపోతుందని అన్నారు. స్నూపింగ్‌కు ఎంత మాత్రం సాధ్యం కాదని, ఇది రక్షణ కోసం ఉద్దేశించిన యాప్ అని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుని హక్కు ఎలా ఉంటుందో అదే విధంగా ఇతర యాప్‌ల మాదిరిగానే అక్కర్లేద నుకుంటే ఈ యాప్‌ను కూడా తొలగించుకోవచ్చని, యాప్‌ను ప్రీ-ఇన్‌స్టాల్ చేయాలని ఆదేశించడానికి ముందు ఈ వెనులుబాటు ఉండేలా తాము చర్యలు తీసుకున్నామని వివరిం చారు. ఫోనులో యాప్ ఉందంటే ఆటోమాటిక్‌గా ఆపరేట్ అవుతుం దని కాదని, యూజర్లు రిజిస్టర్ అయితేనే అది ఆపరేట్ అవుతుం దని చెప్పారు.'ప్రజల భాగస్వా మ్యం ఉంటేనే యాప్ విజయవం తమవుతుంది. కానీ ఇప్పుడు పబ్లిక్ ఫీడ్‌బ్యాక్‌ను తీసుకుని తామిచ్చిన ఆదేశాల్లో మార్పులు చేసేందుకు మేము సిద్ధంగా ఉన్నాం' అని సింధియా తెలిపారు. సింధియా మంగళవారం నాడు కూడా సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వివరణ ఇచ్చారు. ఇది పూర్తిగా ఐచ్ఛికంగా, ప్రజా స్వామ్య తరహాలో తీసుకువచ్చిన యాప్ అని, విని యోగదారులు యాప్‌ను యాక్టివేట్ చేసుకుని దాని ప్రయోజనాలు పొందవచ్చని, అలా కాదనుకుంటే ఏ సమయంలోనైనా ఆ యాప్‌ను డిలీట్ చేయవచ్చని తెలిపారు.

# వీధి కుక్కల దాడిలో గాయపడిన బాలుడి ఘటనపై స్పందించిన సీఎం



హైదరాబాద్, డిసంబర్ 3:హాయత్‌నగర్‌లో మూగ బాలుడు ప్రేమ్ చంద్‌పై వీధి కుక్కలు దాడి చేసిన ఘటనపై ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పందించారు. హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి కార్యాలయంలోని అధికారులతో ఈ ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. బాలుడి పరిస్థితిపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కుక్కల దాడిలో గాయపడిన బాలుడికి మెరుగైన వైద్యం అందించాలని వారిని అదేశించారు. బాలుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అతడికి అవసరమైన తక్షణ సాయం అందించాలని సూచించారు.

స్వయంగా బాలుడిని పరామర్శించటంతో పాటు, ఆ కుటుంబాన్ని కూడా కలిసి.. వారి బాగోగులు పరిశీలించి, ప్రభుత్వ పరంగా వారిని ఆదుకోవాలని కమిషనర్‌కు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో జరిగిన సంఘటనలు అనుభవాలను దృష్టిలో పెట్టుకొని. . తక్షణం వీధి కుక్కల దాడుల కట్టడికి చర్యలు చేపట్టాలని ఆయన అదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఉన్నతాధికారులకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

హయత్‌నగర్ షిర్డీ నగర్‌లో బి తిరుపతి, చంద్రకళ దంపతులు నివసిస్తున్నారు. అపార్ట్ మెంట్ వాచ్‌మెన్‌గా తిరపతి పని చేస్తున్నాడు. అతడి భార్య చంద్రకళ కూలీ పని చేస్తుంది. వీరికి ప్రేమ్‌చంద్ (8) కుమారుడు ఉన్నాడు. అతడికి మాటల రావు. మంగళవారం (2-12 -2025) ఉదయం ప్రేమ్ చంద్.. తన ఇంటి సమీపంలోని కిరాణ దుకాణానికి వెళ్తున్నాడు. కుక్కల గుంపు అతడిపై మూకు మ్మడిగా దాడి చేశాయి. శీతా కాలం కావడంతో అతడు స్వెటర్ ధరించాడు.

ఆ స్వెటర్‌ను నోటితో కరిచి అతడిని కొంత దూరం లాక్కెళ్లాయి. ప్రేమ్ చంద్ మూగవాడు కావడంతో కేకలు వేయలేక నిస్సహాయంగా ఉండిపోయాడు. స్థానికులు వెంటనే స్పందించి.. రాళ్లు విసిరి కుక్కలను తరిమి కొట్టారు. ఈ ఘటనలో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే స్పందించి.. 108 అంబులెన్స్‌కు కాల్ చేశారు.

ఆ వాహనంలో అతడిని ఫీవర్ ఆసుపత్రికి తరలించారు. బాలుడికి మెరుగైన వైద్య చికిత్స కోసం నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు. బాలుడి చెవకి వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రస్తుతం ఆ బాలుడిని ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు అతడి తల్లి దండ్రులు వెల్లడించారు. ఈ సంఘటనపై పత్రికలో వార్త కథనాలు వెలువడడంతో సీఎం రేవంత్ రెడ్డి పైవిధంగా స్పందించారు.

## సన్నిత సెంటర్ ను ప్రారంభించిన పోలీస్ కమిషనర్

వరంగల్ డిసంబర్ 3: వరంగల్ నగరంలోని మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ లో సన్నిత సెక్షన్ ను పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ప్రారంభించారు. బుధవారం మిల్స్ కాలనీ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన భవనంలో పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ డీసీపీ దార కవిత, ఏసీపీ శుభం ప్రకాష్ లతో కలిసి ఆయన సన్నిత కేంద్రాన్ని ప్రారంభించారు.

## భూదార్ కార్డులపై కీలక నిర్ణయం

హైదరాబాద్, డిసంబర్ 3: భూదార్ కార్డులపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసు కుంది. ఈ క్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడి ఇందుకు సంబ ంధించిన వివరాలు వెల్లడిం చారు. భూదార్ కార్డులు సిద్ధం చేశామని.. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత అందజేస్తామని చెప్పుకొచ్చారు. రెండో విడతలో 373 నక్షలేని గ్రామాల్లో సర్వే చేస్తామని..ఎన్నికల తర్వాత భూదార్ కార్డులు అందజేస్తామని తెలిపారు.

రెండేళ్ల ప్రజా పాలనలో కేసీఆర్ హయాంలో తీసుకువ చ్చిన ధరణిని బంగాళాఖాతంలో వేశామని విమర్శించారు. ప్రజలు మెచ్చే భూ భారతి చట్టాన్నితమ ప్రభుత్వంలో తీసుకువచ్చామని పేర్కొన్నారు. పైలట్ ప్రాజెక్ట్ కింద నక్షలేని 5గ్రామాల్లో భూ సర్వే పూర్తి చేశామని వివరించారు. ఇవాళ(బుధవారం) తెలంగాణ సచివాలయంలో మీడియాతో మంత్రి పొంగులేటి మాట్లాడారు. 6వేల మంది వీఆర్‌ఏలను నియమించామని తెలిపారు.

3490మంది సర్వేయర్లకు లైసెన్స్‌లు ఇచ్చామని చెప్పుకొచ్చారు.

ఒక్కో రెవెన్యూ గ్రామానికి సర్వేయర్లను అలాట్ చేశామని తెలిపారు. రోవర్స్ కొనుగోలు చేసి సర్వేయర్లకు అప్పగిస్తున్నా మని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా కుప్ప కూల్చారని..తమ ప్రభుత్వం సరిచేస్తున్నామని వివరించారు. 59 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులను అధునాతనంగా నిర్మిస్తున్నామని మంత్రి పొంగు లేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

## రోడ్లు, డ్రైనేజీల పునరుద్ధరణకు రూ.100 కోట్లు ఇవ్వండి

**- రోడ్లు, డ్రైనేజీల పునరుద్ధరణకు రూ.100 కోట్లు ఇవ్వండి**
**-రియల్-టైమ్ మానిటరింగ్ వ్యవస్థలు ఏర్పాటు చేయాలి**
**-వరంగల్ నియోజకవర్గ అభివృద్దే ధ్యేయం**
**-వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య**

వరంగల్, డిసంబర్ 3: వరంగల్ సిటీలో అక్టోబర్ నెలలో మెంథా తుఫాన్‌కారణంగా కురిసిన వర్షాలు, తుఫాను వల్ల కలిగిన భారీ నష్టంపై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో జీరో అవర్‌లో గళమెత్తారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 200 మిల్లీమీటర్ల(200 ఎ.ఎ)కు పైగా వర్షం కురవడంతో శివనగర్, ఎన్ఎన్‌నగర్, డీకేనగర్ సహా 45 కాలనీలు తీవ్రంగా మునిగిపోయాయని ఎంపీ వివరించారు.

పోతన రోడ్, భద్రకాళి పాలిటెక్నిక్ రోడ్, ములుగు రోడ్, బొందివాగు, పోచమ్మమైదాన్ 80 అడుగుల రహదారులు పూర్తిగా దెబ్బతిని గుంతలతో నిండిపోయాయని ఎత్తి చూపారు.

కొన్నిచోట్ల రహదారులు నదులుగా మారాయని ఎంపీ డా.కడి యం కావ్య పార్లమెంట్ సమావేశంలో పేర్కొన్నారు. ఆ సమయంలో ఒక గర్భిణిని ట్రాక్టర్‌లో తరలిం చాల్సిన పరిస్థితి ఏర్పడిందని గుర్తు చేసుకొన్నారు.

**చురక**

ప్రతి పక్షాలు ప్రశ్నిస్తే
ప్రతిఒక్కటి నాటకం
ప్రభుత్వం అపవాదు
ప్రజలకది బూటకం.
పార్లమెంటు ఎప్పటికీ
పలు చర్చల నిలయం
అవుతుందా మాట్లాడితే
అది డ్రామల వలయం



-వేల్పుల నారాయణ
9440433475

**రాధశ్రీ రాగాలు**

దోచె గోపిక వలువ
కాచె ద్రౌపది విలువ
కాదు కాదే తులువ
అనును రాధశ్రీ
క్షుద్రులకు దానమ్ము
చేయకూడదు సుమ్ము
నాదు వాక్యము నమ్ము
అనును రాధశ్రీ



-రాధశ్రీ
సెల్:9494481210


ఆహ్వానం

ఉదయ సాహితి తెలంగాణ



7 డిసెంబర్ 2025 ఆదివారం ఉ॥ 9.30 గంటలకు

వేదిక: ఎన్.టి.ఆర్. ఆడిటోరియం, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి, హైదరాబాద్.



అందరూ ఆహ్వానితులే !

ఉదయ సాహితి - తెలంగాణ

ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు శ్రీ దాస్యం సేనాధిపతి గారి 70వ జన్మదినోత్సవ సందర్భంగా వెలువరించిన

అక్షర గీతం (సప్తతి సంచిక)

ఆవిష్కరణ సభ

ముఖ్య అతిథి : శ్రీ సి.హెచ్. విద్యాసాగర్ రావు గారు, మహారాష్ట్ర పూర్వ గవర్నర్
గ్రంథావిష్కర్త : డా. కె.వి. రమణాచారి గారు, ఐ.ఏ.ఎస్. రిటైర్డ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు
సభాధ్యక్షులు : డా. సుద్దాల అశోక్‌తేజ గారు, ప్రముఖ కవి, జాతీయ ఉత్తమ సినీ గేయ పురస్కార గ్రహీత
సభా ప్రారంభకులు : శ్రీ అమర్‌సింగ్ తిలావత్ గారు - (దాస్యం బాల్యమిత్రులు) ఉమ్మడి ఆం.ప్ర రాష్ట్ర మాజీ మంత్రివర్యులు
ప్రార్థనా గీతం : శ్రీమతి సావిత్రి రంజోల్కర్ గారు - నవీ ముంబై, సంపాదకులు-అక్షర గీతం
అక్షర గీతం నేపథ్య వివరణ : శ్రీ శ్రీదాస్యం లక్ష్మయ్య గారు, రాష్ట్ర అధ్యక్షులు, ఉదయ సాహితి, తెలంగాణ, ప్రధాన సంపాదకులు, అక్షర గీతం
విశిష్ట అతిథులు : డా. ఏనుగు నరసింహారెడ్డి గారు, సంచాలకులు, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ
డా. నలిమెల భాస్కర్ గారు, బహుభాషావేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద అవార్డు గ్రహీత, కరీంనగర్.
శ్రీ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ గారు, జాయింట్ సెక్రటరీ, మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల విద్యాలయాలు, తెలంగాణ
గౌరవ అతిథులు : డా. అమ్మంగి వేణుగోపాల్ గారు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ తొలి కాళోజీ పురస్కార గ్రహీత
డా. నామోజు బాలాచారి గారు, కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమి
శ్రీ బైస దేవదాస్ గారు, సంపాదకులు, నేటి నిజం
ఆత్మీయ అతిథులు - అభినందన సందేశాలు :
ఆచార్య మసన చెన్నప్ప గారు, ప్రముఖ సాహితీవేత్త
శ్రీ మౌనశ్రీ మల్లిక్ గారు, ప్రముఖ కవి, ఉత్తమ సినీ గేయ రచయిత
శ్రీ సరికొండ కోటంరాజు గారు, శ్రీ సరస్వతీ విద్యాపీఠం, సీనియర్ కార్యకర్త
డా. దాస్యం విజయ కుమార్, ప్రముఖ వైద్యులు, (దాస్యం సోదరులు)-నిర్మల్.
శ్రీమతి అయినంపూడి శ్రీలక్ష్మి గారు, అక్షర యాన్, వ్యవస్థాపకురాలు
శ్రీ అనుముల దయాకర్ గారు, శాతవాహన టైమ్స్ ఎడిటర్-ఆదిలాబాద్.
మేజర్ శ్రీ రేళ్ల సంజీవ్ గారు, అసిస్టెంట్ ప్రొఫెసర్, కరీంనగర్.
శ్రీ కొత్త అనిల్ కుమార్ గారు, సాహితీ గౌతమి ప్రధాన కార్యదర్శి, కరీంనగర్.
పుస్తక పరిచయం : శ్రీమతి ధూళిపాళ అరుణ గారు, ప్రముఖ కవయిత్రి, రచయిత్రి
తొలి ప్రతి స్వీకర్త : శ్రీ ఆశ్వాపురం వేణుమాధవ్ గారు, చాత్తాద శ్రీవైష్ణవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు
సభా సమన్వయం : డా. పోరెడ్డి రంగయ్య గారు, ప్రముఖ కవి, రచయిత, రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఉదయసాహితి, తెలంగాణ.
వందన సమర్పణ : శ్రీమతి మూర్తి శ్రీదేవి గారు, సంపాదకురాలు-అక్షరగీతం, రాష్ట్ర మహిళా కార్యదర్శి, ఉ.సా.తె.

ఆహ్వానించువారు :
రమాదేవి కులకర్ణి, రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఉ.సా.తె. పురిమళ్ల సునంద, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉ.సా.తె.
డా. తులసి వెంకట రమణాచార్యులు, రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఉ.సా.తె. లక్ష్మీ పద్మజ దుగ్గరాజు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి, ఉ.సా.తె.

నేటి నిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 4-12-2025

### సప్త పదులు

బుద్ధి
వృద్ధి
శరీరం నీటితోనూ
చిత్తం జ్ఞానంతోనూ
శుద్ధి.

-కె.ఎమ్.కె.మూర్తి
9441802694

ధైర్యం,
అధైర్యం
ఒడిదుడుకులలో
పెద్దల సూచనలే
కలిగించును
మనోధైర్యం.

-డి.వి.వి.ఎస్.మూర్తి.
9949813047

మురిపిస్తుంది
మరిపిస్తుంది
కష్టాలెన్నున్నా
మనసులో ధైర్యమే
ఆనందంగా
నడిపిస్తుంది

-ప్రసాద్ రావు
9493166148

### సప్త పదులు

వినండి
తినండి
భోజనం ముందు
పండించే
రైతన్నను
తలవండి

-కోలా సత్యనారాయణ
విశాఖపట్నం

జయం
విజయం
లక్ష్య సాధన
ధృడంగావుంటే
ఎవరూపొందరు
అపజయం

-విజయకుమారి
విజయవాడ

ఫలము
సఫలము
ఆచరణ మంచిదైతే
ఎప్పుడూ
ఉండదు
విఫలము

-మాధవి మేళ్ళచెర్వు
6303092523

## ఓటంటే ....

ప్రజాస్వామ్య ఆకాంక్ష
గణతంత్ర ఆకాంక్ష దీక్ష
అస్తిత్వ రుజువు వేదం
రాజ్యాంగ వరప్రసాదం-
అవినీతిని ధనుమాడే అస్త్రం
నిజాయితీని నిలబెట్టే శాస్త్రం
నిబద్ధతకు కోలమానం
దేశ కీర్తి మణి దీపం-
ఎదురులేని శక్తి
రాత రాసే యుక్తి
ఓటులోనే దాగున్నది
మనందరి భాగ్య రీతి -
ఓటంటే
సామాన్యుడి ఆయుధం

రాజ్యాంగ వజ్రాయుధం
వెలుగుల రక్షణ బంధం
జన పరిరక్షణ సూత్రం-
ఓటంటే
తేడా చూపని ధర్మం
యుక్తిని చాటే మర్మం
ప్రగతి పథంలో జన చిహ్నం
జనస్వామ్య
దరహాస పుష్పం-
ప్రజాస్వామ్య పూల జల్లు కల
జనం కన్నీళ్లు తుడిచే
ఓదార్పు
మేల్కొల్పు బాట లో
జన కాపలా దారు -

సామాన్యుని కలల సాకారం
మదనపడే అలజడుల ఓదార్పు
ఎగిరే జన చైతన్య జెండా
సామాజిక న్యాయ పిడికిలి-
చైతన్య తొలి అడుగు
స్వేచ్ఛ కు ప్రాణం
జవాబును కోరే వెలుగుల
ఉదయం
ఓటు తోనే సామాజిక వికాసం-
ఓటే మనందరి భాగ్యరేఖ
ఓటే ప్రజాస్వామ్య ధైర్య కవచం

బాధ్యత బావుట
సమర నాదం జ్వలిత గీతం
స్వేచ బతుకు కై జ్ఞాన వెలుగుకై
ధర్మ తేజ గగనం ఓటు-
సమస్యల జ్వాలల్లో ప్రాణం
ఆరి పోని వెలుగు కోసం
నీ చుట్టూ నీ కోసం
తోడుగుండే నేస్తం
ఓటు-
సద్వినియోగం
బాధ్యత నీది
అవగాహన
కర్తవ్యం మనది
విలువను పెంచే
విధేయత మనది-

జనం గుండెల్లో వెలుగుల కోసం
జనం మోముల్లో నవ్వుల కోసం
రేపటి జగతికి బాటల కోసం-
నీతికి నిలబడే
నియ్యతి మనది
విలువ ను పెంచే
బాధ్యత మనది-
ఓటులో
ప్రగతిని చూసుకుందాం -
మార్పు పథం లో సాగిపోదాం
ఆదర్శ సమాజం
నిర్మిద్దాం-



- సిరిసిల్లా గఫూర్ శిక్షక్
9849062038

## దుఃఖ లోయ

కవిత్వమే
మనల్ని కలిపింది.
కవిత్వమే
మనల్ని నిలిపింది.
అర్థాంతరంగా ఆగిన పద్యంలా
ఆగాధమైన లోయ ఎదురయ్యింది.
ఎన్ని ఊహల్ని పంచుకున్నాము
గుండెల నిండా
ఎంత భావుకతను వొంపుకున్నాము
సౌందర్యమంతా
మనుషుల్లోనే దర్శించాము
హఠాత్తుగా ఒక ఖాళీ పన్
కంపించి కంపించి పోతున్న బురేదిన్.
అంతా తెలుసనుకున్నాను
ఆకళింపే ఇంపు అనుకున్నాను
ఎడబాటును మించిన
తత్తర పాటు లేదని తెలుసుకున్నాను.
నువ్వెక్కడున్నావో తెలియదు
ఇప్పుడు నేనెక్కడున్ననో
అర్థం కావటం లేదు
జీవితం ఒక ప్రహేళిక
గాలిలో తేలిపోయే తూలిక.
ప్రియతమా!
ఈ పాతాళంలో నేనుండలేను
నన్ను పైకి చేదుకో
దయార్ద్ర హృదయంతో
ఈ భౌతిక స్మృతుల నుంచి
ఆదుకో!



-డా॥ ఎన్. గోపి
సెల్:9391028496

# ఈడ పిల్ల-ఆడ పిల్ల!

'ఈడ పిల్ల-ఆడ పిల్ల' కేవలం ఒక సామెత కాదు, ఆడపిల్ల జీవితంలో సహజంగా సంభవించే పరివర్తనకు ఒక ప్రతీక. ఒక స్వప్న లోకంలో నుంచి మరో స్వప్న లోకంలోకి శాశ్వత స్థానభ్రంశం. మన సంస్కృతిలో ఆడపిల్ల జీవితం రెండు ప్రముఖ ప్రస్థానాల సంగమం. దశలుగా విభజించబడింది. ఒకటి పుట్టింటిలో గడిపే 'సుఖాల' దశ (ఈడ పిల్ల), పెళ్లైన పిదప మెట్టినింట్లో గడిపే 'బాధ్యతల' దశ (ఆడ పిల్ల). ఈ రెండు దశల మధ్యే ఆడపిల్ల యొక్క స్వేచ్ఛ, వ్యక్తిత్వం, కర్తవ్య బాధ్యతలు, ఆత్మ స్థితి మలచబడతాయి.

### 'ఈడ పిల్ల'గా

'ఈడ పిల్ల'గా ఆమె తనదైన ప్రపంచంలో జీవిస్తుంది. తల్లిదండ్రుల మమకారం, తోబుట్టువుల వాత్సల్యం, బాల్యపు చిలిపితనం అన్నీ ఆమె చుట్టూ రక్షణ కవచాలుగా పెనవేసుకొని ఉంటాయి. ఆమె కేవలం కుటుంబంలో ఒక భాగమే కాదు, తల్లిదండ్రుల కలల ప్రతిరూపంగా, ఆశల ప్రతిబింబంగా ఉంటూ పెరుగు తుంది. కుటుంబ సభ్యులందరి ప్రేమ, ఆదరాభిమానాలకు కేంద్ర బిందువై నిలుస్తుంది. తక్కువ బాధ్యతలతో ఎక్కువ స్వేచ్ఛను స్వంతం చేసుకుంటుంది. పుట్టిల్లు కేవలం నాలుగు గోడల నిర్మాణం కాదు, ఆమె ఆత్మకు ఉనికి, వ్యక్తిత్వానికి పునాది.

'ఈడ పిల్ల'గా ఉన్నప్పుడు ఆమె కన్నుల్లో బాల్యపు వెలుగు ప్రజ్వలిస్తుంది. తల్లిదండ్రుల ఒడిలో కావల్సినంత ఆప్యాయత లభిస్తుంది. తోబుట్టువులుతో కలిసి ఆడుతూ, పాడుతూ నిండుగా హాయిగా నవ్వే స్వేచ్ఛ ఉంటుంది. పుట్టింటి ప్రాంగణం ఆమెకు పరిమళించే తోట. ఆమె ఆటల అడుగుల్లో చిలిపితనం ఒలకబోస్తుంది. పాటల పరుగుల్లో పరువాలు కురిపిస్తుంది. ఊహల్లో తేలుతూ ఆకాశాన్ని చుంబిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఈడ ఆమె స్వతంత్ర సామ్రాజ్యంలో ఒక యువరాణి.

### 'ఆడ పిల్ల'గా

ఏ ఆడపిల్లకైనా ఇలాగే ఎప్పటికీ కొనసాగే పరిస్థితి ఉండదు. వివాహం ఒక తప్పనిసరి మలుపు. 'ఈడ పిల్ల'గా పిలవబడిన ఆడపిల్ల మెట్టినింట్లోకి వెళ్ళినప్పుడు 'ఆడ పిల్ల'గా మారుతుంది. పుట్టింటి గడప దాటిన క్షణం నుండి ఆమె మరో కొత్త ఇంటికి పునాదిగా, కొత్త బంధాలకు గుళికగా మారుతుంది. క్రమేణా కోడలు, భార్య, తల్లి లాంటి కొత్త పాత్రల్లోకి ఒదిగి పోతూ, ఆయా పాత్రల్లో ఆమె ఒక కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తుంది. ఆనందం ఇక నుండి తన కొరకే కాక మెట్టినింటి సంపూర్ణతకు అర్పిస్తుంది. ఇక్కడ తనకంటూ ఒక కుటుంబం ఏర్పడిన తరువాత, స్వేచ్ఛ కన్నా బాధ్యతకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాల్సి వస్తుంది. 'ఈడ పిల్ల'గా పొందిన సుఖం 'ఆడ పిల్ల' త్యాగంగా మారుతుంది. నిజానికి ఇది స్వార్థాన్ని విడిచిపెట్టి తన వారిగా మారిన 'ఇతరుల' కోసం జీవించే స్థితి. రెండు ప్రపంచాల మధ్య ఆమె ఒక వారధిలా నిలుస్తుంది. పుట్టింటి నుంచి అత్తింటికి ఆమె ఒక నదీ ప్రవాహంలా ప్రవహిస్తుంది. రెండు తీరాలను (ఒడ్డులను) సస్యశ్యామలం చేస్తుంది.

ఆ క్రమంలో ఒక ఆడపిల్లగా ఆమె అనుభవించే కష్టం, ప్రదర్శించే త్యాగం, సాధించే పరిణతి ప్రతిబింబిస్తాయి. ఈ ప్రయాణం కేవలం భౌతికంగా ఒక ఇంటి మార్పు మాత్రమే కాదు, అది ఒక మానసిక లేదా ఆధ్యాత్మిక మార్పు. ఈ మార్పుతో ఆమె తనకు ఎదురయ్యే పరిస్థితులను బేరీజు వేసుకుంటూ, లోతైన అవగాహనతో ముందుకు వెళ్తూ తన సంసార నావకు తెర చాపలా మారుతుంది.

> " 'ఈడ పిల్ల'గా పిలవబడిన ఆడపిల్ల మెట్టినింట్లోకి వెళ్ళినప్పుడు 'ఆడ పిల్ల'గా మారుతుంది. పుట్టింటి గడప దాటిన క్షణం నుండి ఆమె మరో కొత్త ఇంటికి పునాదిగా, కొత్త బంధాలకు గుళికగా మారుతుంది. క్రమేణా కోడలు, భార్య, తల్లి లాంటి కొత్త పాత్రల్లోకి ఒదిగి పోతూ, ఆయా పాత్రల్లో ఆమె ఒక కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తుంది."

### ఒక యాత్ర

నిజానికి 'ఈడ పిల్ల' నుండి 'ఆడ పిల్ల' వరకు సాగేది ఒక చారిత్రక యాత్ర. ఈ మార్పు ఒక అద్భుతమైన జీవిత యాత్ర. 'ఈడ పిల్ల'గా ఆమెకు 'పొందే హక్కు' ఉంటుంది. 'ఆడ పిల్ల'గా ఆమెకు 'ఇచ్చే ధర్మం (బాధ్యత)' వస్తుంది. ఈ యాత్రలో ఆడపిల్ల 'ఆనందం' నుంచి 'త్యాగానికి', 'స్వీకరించే దశ' నుంచి 'అర్పించే ఎత్తుకు' ఎదుగుతుంది. ఇదే ఆడపిల్ల ఆత్మ స్థితిని నిర్వచించే తాత్విక ప్రయాణం. ఆమె ఎవరికీ బందీ కాదు. పుట్టింటి ఛాయలు, మెట్టినింటి మకరందాలు ఆమె జీవితంలో శాశ్వతంగా నిలిచిపోయే మధుర ఘడియలు. పుట్టింటి స్వేచ్ఛా సౌందర్యాన్ని, మెట్టినింటి త్యాగ శీ(బ)లాన్ని సమ్మిళితం చేసుకొని తన వ్యక్తిత్వాన్ని ఎప్పుడూ కోల్పోకుండా ఆడపిల్లగా ఆమె సాగించే యాత్ర నిజంగా ఒక చారిత్రక ఘట్టమే! ఆమె ఎప్పుడూ మారదు.. 'ఈడ పిల్ల' దశ నుండి 'ఆడ పిల్ల' దశలోకి మారినా, ఆమె అంతరంగంలో మాత్రం శాశ్వతంగా ఒకే రూపం ఉంటుంది.



నేడు మారుతున్న సమాజ స్థితిగతుల్లో 'ఈడ పిల్ల'గా ఉన్నప్పటి స్వేచ్ఛను 'ఆడ పిల్ల'గా మారగానే కోల్పోకూడదు. 'ఈడ పిల్ల'గా ఉన్నప్పటి హక్కులను కాదనకూడదు, 'ఆడ పిల్ల' గా నిర్వర్తించే బాధ్యతలను అలక్ష్యం చేయకూడదు. 'ఈడ పిల్ల? ఆడ పిల్ల' అనేది కేవలం పుట్టింటికి, మెట్టినింటికి నడుమ ఉండే భేదం కాదు, ఇది ప్రకృతి ప్రతి ఆడపిల్లకు నిర్దేశించే దశల నడుమ ఉండే సవాళ్లతో కూడిన స్థితిగతులు. ఈ సవాళ్లను అధిగమించే క్రమంలోనే ఆమె వ్యక్తిత్వం మరింత పరిణతి చెందుతుంది. 'ఈడ పిల్ల'గా ఇక్కడ పొందినా, 'ఆడ పిల్ల'గా అక్కడ ఇచ్చినా, ఆమె ఆడపిల్ల రూపంలో సజీవంగా ఉన్న ఒకే వ్యక్తి, ఒకే ఆత్మ.

### ఈ రెండు దశల లోతు

ఈ రెండు దశలు పరస్పరం విరుద్ధంగా కనిపించినా, నిజానికి ఇవి పరస్పర పూరకాలు. పుట్టింట్లో స్వీకరించడానికి అలవాటు పడ్డ ఆడపిల్ల, మెట్టినింట్లో ఇవ్వడం నేర్చుకుంటుంది. స్వీకారం లేకుంటే అర్పణకు, అర్పణ లేకుంటే స్వీకారానికి విలువ ఉండదు. ఈడ-ఆడ అనే భేదం వాస్తవానికి జీవితంలోని రెండు ధృవాలు: పొందడం మరియు ఇవ్వడం.

'ఈడ పిల్లకు' (పుట్టింట్లో) బలం, స్వేచ్ఛ, ఆధిపత్యం ఉండగా, 'ఆడ పిల్లకు' (మెట్టినింట్లో) కరుణ, క్రమ శిక్షణ, సంయమనం వంటి గుణాలు ఉండాలనేది ప్రకృతి సహజం కాదు, సమానత్వాన్ని ధిక్కరించే సామాజిక నిర్దేశం. ఇది శాశ్వతమేమీ కాదు, మార్పు అనివార్యం. ప్రకృతికి ద్వంద్వ స్వభావం. 'ఈడ పిల్ల - ఆడ పిల్ల' కూడా ఈ ద్వంద్వ తత్వానికి ప్రతిబింబం. కానీ ఇక్కడ ముఖ్యంగా గమనించాల్సింది.. ద్వంద్వ తత్వం విభజన కోసం కాదు, వ్యక్తిత్వ పూర్ణత్వం కోసం. ఈ రెండు కలిస్తేనే సంపూర్ణత సంతరించుకున్న స్త్రీ మూర్తిగా మారుతుంది.

### ప్రశ్నించాల్సిన అంశం

ఎందుకు ఈ ద్వంద్వం 'ఆడపిల్ల' కు మాత్రమే వర్తించాలి? నిజానికి ఇది సమాధానం లేని ప్రశ్న. కానీ దీనికి సమాధానంగా సమాజ క్రమబద్ధతకు ఆడపిల్ల త్యాగం అవసరమనే సంప్రదాయాన్ని సృష్టించారు. ఆడపిల్ల వైపు నుంచి ఆలోచిస్తే ఈ 'సంప్రదాయం' అంత హేతుబద్దంగా అనిపించక పోవచ్చు. సంప్రదాయాలన్నీ మానవ నిర్మితం, ప్రకృతి సహజాలు కాదు. తాత్వికంగా ఆలోచిస్తే ఇది స్త్రీ పురుషుల మధ్య అసమానతను సూచిస్తుంది. ఆడపిల్లకు పుట్టింటి ప్రేమ, స్వేచ్ఛ తాత్కాలికమని, మెట్టినింటి బంధం శాశ్వతమని సమాజం భావిస్తుంది. కానీ మనిషి శరీరమే కానీ ఆత్మ ఏ ఇంటికి బందీ కాదు. మనిషికి లింగ భేదం శారీరకమే కానీ ఆత్మకు కాదు. పుట్టింటిలో ఆడపిల్ల అనేది 'ప్రేమను స్వీకరించే' ఆత్మ. మెట్టినింటిలో ఆడపిల్ల అనేది ఆ 'ప్రేమను అర్పించే' ఆత్మ. ఈ రెండు రూపాలూ ఒకే ఆత్మలోని రెండు కోణాలు మాత్రమే. లింగ భేదం లేకుండా స్త్రీ, పురుషులిద్దరిని స్వీకరించే దశలోనూ, అర్పించే దశలోనూ సమానంగా నిలబెట్టడంలోనే దార్శనిక న్యాయం ఉంటుందేమో!

ప్రస్తుత సంప్రదాయాల ప్రకారం ఏ ఆడపిల్ల అయినా 'ఈడ'నే ఉండదు ఎప్పుడు! పెళ్లీడు వచ్చాక పెళ్లి చేసుకొని 'ఆడ'కు వెళ్లాల్సిందే. ఇది దాదాపు అన్ని ప్రాంతాల, దేశాల, మతాల సంప్రదాయాలలో ఉన్నదే. ఏది ఏమైనా, ప్రస్తుత పరిస్థితుల్లో ఆడపిల్లను 'ఈడ-ఆడ' అని విభజించే బదులు, ఇది ఆడపిల్లకు ప్రకృతి ప్రసాదించిన అపూర్వ వరమని, ఆమె ఒక అమూల్యమైన మనిషని భావిస్తూ ముందుకెళ్లాలి.

### అంతులేని విమర్శల్లో అత్తవారిల్లు

ఆనాడైనా, ఈనాడైనా అంతులేని కథలా అత్తవారిల్లు విమర్శలకు గురి అవుతూనే ఉంది. నేటికీ అత్తవారిల్లు అనగానే 'సుఖాల్లో ఉన్న ఆడపిల్ల కష్టాల్లోకి అడుగిడింది' అన్నట్లు చిత్రించడం పరిపాటిగా మారింది. కొన్ని సందర్భాల్లో పెళ్లి ఒప్పందాల్లో భాగంగా ఇచ్చి పుచ్చుకునే లాంఛనాలు కారణం కావచ్చు. ఎంతవరకైతే పెళ్లిని ఇరు కుటుంబాల నడుమ కొన్ని షరతుల ఒప్పందంగా పరిగణిస్తా మో, అంత కాలం ఈ సమస్య వెంటాడు తూనే ఉంటుంది. నాగరికతలో మనిషి ఎంత ఎదుగుతున్నా, ఈ రుగ్మత ఏదో ఒక రూపాంతరం చెందుతూ సమాజాన్ని పట్టి పీడిస్తూనే ఉంది. గోరంతను కొండంతలుగా చేసి చూపించడం కూడా, ఇరుగుపొరుగుతో పాటు అన్ని మీడి యాలకు అలవాటుగా మారింది. అత్త వారింట్లో ఆడపిల్ల పడే ప్రతి ఇబ్బందికి అత్తగారినే (అత్తమామలను) నిందించడం పరిపాటి అయ్యింది. కారణాలేమైనా ప్రతి విడాకుల ప్రహసనం వెనక అత్తగారో, ఆడబిడ్డనో ఉండవచ్చని ప్రచారం చేస్తారు. ఇందుకు చట్టాన్నీ ఆసరాగా వాడుకుం టారు. చట్టానికి కళ్లే సాక్ష్యాలు. సాక్షుల నిజాయితీ న్యాయస్థానాలకు తెలియనిది కాదు. జాతకాలు, కట్న కానుకలు కాదు, సవ్యమైన సంసార మనుగడకు మనస్త త్వాల ఏకీకరణ కావాలి. మనస్తత్వాలు పొసగని జంట ఎన్నాళ్ళని సర్దుకు పోతారు?

> "అంతులేని విమర్శల్లో అత్తవారిల్లు
> ఆనాడైనా, ఈనాడైనా అంతులేని కథలా అత్తవారిల్లు విమర్శలకు గురి అవుతూనే ఉంది. నేటికీ అత్తవారిల్లు అనగానే 'సుఖాల్లో ఉన్న ఆడపిల్ల కష్టాల్లోకి అడుగిడింది' అన్నట్లు చిత్రించడం పరిపాటిగా మారింది. కొన్ని సందర్భాల్లో పెళ్లి ఒప్పందాల్లో భాగంగా ఇచ్చి పుచ్చుకునే లాంఛనాలు కారణం కావచ్చు".

### అలనాటి అత్తవారిల్లు (మెట్టినిల్లు) ఇప్పుడెక్కడ?

ఒకప్పుడు మెట్టినిల్లే ఆడపిల్లకు అంతిమ స్థానంగా ఉండేది. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో మార్పులు వచ్చాయి. విద్యతో ఆడపిల్లకు కొత్త శక్తితో పాటు ఆలోచనల్లో స్వాతంత్ర్యం పెరిగింది. ఉద్యోగంతో పాటు సిద్ధించిన ఆర్థిక స్వావలంబన ఆమెను పుట్టింటికి, మెట్టినింటికే పరిమితం చేయకుండా ఆమెకు వ్యక్తిగతంగా ఓ ప్రత్యేక స్థానాన్ని సృష్టించుకునేలా చేసింది. కోడలిగా, తల్లిగానే కాక సమాజంలో ఒక సంపూర్ణ వ్యక్తిగా గౌరవం సంపాదించుకుంది. ఆ క్రమంలో నాటి సమిష్టి కుటుంబాల కన్నా నేడు చిన్న కుటుంబాలే ఎక్కువయ్యాయి. అత్తవారిల్లు బంధం కన్నా భార్యాభర్తల సమతుల్య బంధానికే ప్రాధాన్యత పెరిగింది. ఆడపిల్లకు ఆస్తిలో సమాన హక్కుల చట్టం రావడంతో పుట్టింటితో కూడా శాశ్వత సంబంధం నెలకొంది.

అలనాటి 'అత్తవారిల్లు'కు పాత రూపం మారి నేడు కొత్త రూపం సంతరించుకుంది. ఇప్పుడు ఆడపిల్లకు పుట్టింటి బంధంతో పాటు మెట్టినింటి బాధ్యత కూడా నిర్వర్తించాల్సి వస్తుంది. అదనంగా తన స్వంత వ్యక్తిత్వాన్ని చెక్కు చెదరకుండా నిలుపుకుంటుంది. ఆడ-ఈడ అనే తారతమ్యం లేకుండా అంతటా తానై ఉండాల్సి వస్తుంది. అంతటితో ఆగిపోకుండా తనకంటూ ఒక స్వీయ గృహం (పెట్టినిల్లు లేక మరో ఇల్లు) ఏర్పాటు చేసుకొని స్వతంత్రత, ఆత్మగౌరవం, వ్యక్తిత్వం నిర్మించుకుంటుంది. నేడు ఆమె జీవితం స్వీకారం, అర్పణ, స్వతంత్రత (వ్యక్తిత్వం) కలగలిపిన అపూర్వ సమన్వయం.



-ఆచార్య కడారు వీరారెడ్డి
9392447007

## ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి
-బైస దేవదాసు

హైదరాబాద్, డిసంబర్ 3: ప్రతి ఒక్కరిలో ఏదో ఒక ప్రతిభ వుంటుందని, దాన్ని గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని నేటినిజం పత్రిక సంపాదకులు బైస దేవదాసు అన్నారు. ఆదివారం నెల్లూరు పట్టణంలో డా॥పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డి 'నవల' అవార్డు, జమున స్మారక 'నానీ'ల సంపుటి అవార్డు కార్యక్రమం పెన్నా రచయితల సంఘం నిర్వహణలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొని బైస దేవదాసు మాట్లాడుతూ డా॥పెళ్ళకూరు జయప్రద సాహిత్య కృషి చేస్తూ రచనా రంగంలో ప్రతిభ వున్న వారిని గుర్తించి అవార్డులతో ప్రోత్సహిస్తూ సాహిత్య సేవ చేస్తున్నందులకు అభినందనలు తెలిపారు.

సాహిత్యం మన జీవితాన్ని గొప్ప మలుపు తిప్పుతుందని చైతన్యవంతమైన ఆలోచనలతో మంచి మనిషిగా జీవించే అవకాశం కలుగుతుందని అన్నారు. ఎన్నోసమస్యలతో సతమతమయ్యే మనిషికి కాస్తంత ఊరట కలుగుతుందని, ఈ మధ్యకాలంలో ఎంతో మంది మంచి రచనలు చేస్తున్నారని అన్నారు. ఏ ప్రక్రియలో రచన చేసినా చదువరులను తృప్తి పరచాలని, మానవత్వ విలువలను కాపాడ గలగాలని అన్నారు. అవార్డు గ్రహీతలైన 'పాయి దరువులు' నవలా



డా॥పెళ్ళకూరు జయప్రద రచించిన "జయప్రద మెడికల్ కథలు" ఆవిష్కరణలో అతిథులు.

నెల్లూరులో ఘనంగా జరిగిన డా॥పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డి నవల అవార్డు మరియు జమునా స్మారక నానీల సంపుటి అవార్డు మహోత్సవం

రచయిత కె.వి. మేఘ నాథరెడ్డి, 'నానీ కిరణాలు' కవి కాం చనపల్లి రవికాంత లకు శుభాకాంక్షలు తెలిపారు. అనం తరం డా॥పెళ్ళ కూరు జయప్రద సోమిరెడ్డి రచన "జయప్రద మెడికల్ కథలు-2" ను బైస దేవదాసు ఆవిష్కరించారు.

సభాధ్యక్షులు కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత గంగిశెట్టి శివకుమార్ మాట్లాడుతూ తెలుగు భాషను పరిరక్షించడానికి, సాహిత్యాన్ని ప్రోత్సహించడానికి డా॥పెళ్ళకూరు జయప్రద చేస్తున్న కృషిని అభినందించారు.

అవ్వారు శ్రీధ ర్‌బాబు "నానీల వాన" పుస్తకాన్ని డా॥ జయప్రద సోమి రెడ్డి ఆవిష్క రించి మాట్లా డు తూ ఎన్నో పురస్కా రాలు అందుకున్న శ్రీధర్‌బాబు మంచి కవి, రచయత అని కొనియా డారు.

ఆత్మీయ అతిథిగా పాల్గొన్న ఉస్మానియా విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా॥ఎస్.రఘు మాట్లాడుతూ డా॥ఎన్.గోపి గారు ప్రవేశ పెట్టిన 'నానీల' ప్రక్రియను వందలాది మంది కవులు అనుసరించారని, వందల నానీల పుస్తకాలు వెలువడ్డాయని అన్నారు. నానీల్లో కవులు తమ ప్రతిభను చాటుకుంటున్నారని, సామాజిక అంశాలతో నానీలు ఆలోచింపజేస్తున్నాయని, అలాంటి రచనలు పాఠకులకు గుర్తుంటాయని అన్నారు. ప్రముఖ కవి, విమర్శకులు కొండ్రెడ్డి వెంకటేశ్వర రెడ్డి "నానీల కిరణాలు" పుస్తకాన్ని సమీక్ష చేశారు. ప్రముఖ కవి విశ్లేషకులు డా॥సుంకర గోపాల్ "పాయి దరువులు" నవల సమీక్ష చేశారు. ప్రముఖ కవి ఇంద్రగంటి మధుసూదన్ "నానీల వాన"ను సమీక్ష చేయగా, "జయప్రద మెడికల్ కథలు"ను ప్రముఖ కవి, రచయిత ఎమ్వీ రామిరెడ్డి సమీక్ష చేశారు. సభలో ప్రముఖ చిత్రకారుడు కూరెళ్ళ శ్రీనివాస్, ఈతకోట సుబ్బారావు, కోట్ల వెంకటేశ్వర రెడ్డి శ్రీమతి గోవిందరాజు సుభద్రాదేవి, శ్రీమతి తోట సులోచన తదితరులు పాల్గొన్నారు. నానీల సంపుటి అవార్డు గ్రహీత కాంచనపల్లి రవికాంత్, నవల అవార్డు గ్రహిత కె.వి. మేఘనాథ్ రెడ్డిని అతిథులు ఘనంగా సత్కరించారు. నానీల పోటీలో గెలుపొందిన విజేతలు సీనీయర్స్ విభాగంలో అన్నం శివ కృష్ణ, తిప్పావఝుల నరసింహమూర్తి, ఇసనాక దయాకర రెడ్డి, జూనియర్స్ విభాగంలో పి. సాయిసాహితి, పి.వి.తనూజ, యు.వెంకట కార్తీకలకు బహుమతి ప్రదానం జరిగింది. రూప అతిథులకు స్వాగతం పలుకగా, అవ్వా రు శ్రీధర్‌బాబు సభా సమన్వయం చేశారు.



నానీల సంపుటి కవి కాంచనపల్లికి, నవలా రచయిత కె.వి.మేఘనాథ్‌రెడ్డికి అవార్డు ప్రదానం చేస్తున్న అతిథులు.



# జీవన నిర్వేదం నుంచే నిబ్బరమైన జీవితం కోసం
# "నీకోసం నువ్వు" అంటున్న ఇంద్రాణి కవిత్వం

## కవిగా ఇంద్రాణి ఇంకా చాలా దూరమే నడవాల్సి ఉన్నా తొలి అడుగుతోనే తాను గమ్యం చేరుకుంటుందనే నమ్మకాన్ని కలిగిస్తోంది



-అంగలకుర్తి విద్యాసాగర్
9676001230

మన దేశంలో అధిక సంఖ్యాకులకు జీవితం కష్టమయమే ఐనా ఆ కష్టాలు నేర్పే పాఠాలు మధురమైన జ్ఞాపకాలనే మిగుల్చుతాయని తానే ప్రత్యక్ష సాక్షిగా కవిత్వం చెబుతున్నారు ఇంద్రాణి. కష్టాలిచ్చే ఫలాలు మధురమైనవి అంటారు షేక్స్పియర్ మహాకవి.

**"ఎవరికి వారే ఈ లోకం / రారు ఎవ్వరు నీకోసం"** అనే నిర్వేదం కన్నా "నీకోసం నువ్వు" అనే ఒక్క కవిత చాలు ఇంద్రాణిని కవిగా నిలబెట్ట డానికి.

ఎంత చక్కని భావం! ఎంత గొప్ప తాత్వికత! ఎంత సరళమైన వ్యక్తీకరణ! తాత్వికతను కవిత్వం గా, కవిత్వం లో తాత్వికతను ఇంత సరళంగా వ్యక్తం చేసిన తీరు చూస్తుంటే ముచ్చటేస్తోంది. కవిగా ఇంద్రాణి ఇంకా చాలా దూరమే నడవాల్సి ఉన్నా తొలి అడుగుతోనే తాను గమ్యం చేరుకుం టుందనే నమ్మకాన్ని కలిగిస్తోంది. ఈ నమ్మకానికి నేపథ్యమేవిటి?

ఇంద్రాణి కవిత్వం ఓ జీవిత కథ. తన కథలా అనిపించినా ఎందరెందరి కథలనో కవిత్వంలోకి తెచ్చారు ఆమె. ఆ జీవితం లో కష్టాలు, కన్నీళ్ళు, ఆశ, అలసట, ఐనా ముందుకే సాగాలనే నిశ్చయం, దారిలో ముళ్ళూ రాళ్ళను తొలగించుకుం టూనే పోవాలనే నిర్ణయమే తప్ప నిరాశకు చోటివ్వని స్వయంకృషి మీద నమ్మకం... వెరసి బ్రతుకు పాత్రలోకి ఒంపిన సారవంతమైన కవిత్వం.

ఇంత చిన్న వయసులో ఎంత నిబ్బరం! అది అనుభవ రాహిత్యం వల్ల కలిగే అవగాహనాలేమి కాదు. అమాయకత్వం కాదు. తనకెదురైన ప్రతి సమస్యనూ దాని మూలాల్లోకి వెళ్ళి చూడాలనే జిజ్ఞాస. ఎదురైన అనుభవాన్ని తాత్వికంగా చూడ గలిగే ఓర్పు, తాత్వికతను నిత్య జీవిత సంఘ టనలకు జోడించగల నేర్పు. వెరసి జీవితానికో అర్థాన్నివ్వాలనే ఆలోచనాత్మక దృక్పథం.

జీవితం లో కష్ట నష్టాలు పైకి కనిపించే పరీక్షలే! కానీ వాటిని దాటు కుంటూ వెళ్ళడంలోనే బ్రతుకు వృక్షం చేవదేరుతుందనే ఎరుక తన అంతరాంత రాల్లో బలంగా ఉంది. ఇందులో ప్రతి కవిత ఆ ఎరుకకు ఉన్న ఒక్కో పార్శ్వం. మెరుగుపెట్టే కొద్దీ పలు ముఖాలతో మెరిసిపోయే వజ్రం లా జీవితాన్ని తీర్చిదిద్దుకోగలమనే సందేశముంది.

కష్టాల మయమైన జీవితం లోనూ మధురమైన జ్ఞాపకం చిన్నప్పుడు మనమున్న ఇల్లు. నలభై గజాల నేల చెక్కే ఐనా సొంత దనానికి "ఇది నా ఇల్లనే" భావనకు మించిన వ్యక్తీకరణ లేదు. దానితో ముడి వేసుకున్న బంధమెలా ఉందో చూడండి:

**"నా చిన్నప్పుడు ఇక్కడే ఉన్నాము**
**ఈ మూడు గుంటల భూమి మా జ్ఞాపకాల న్నిటినీ**
**ముడేసి పట్టుకున్న పట్టుగొమ్మ.**
**ఆ భూమి లోనే ఒక వేప చెట్టు**
**మా గుడిసెకు నీడనిచ్చేటిది**
**ఆ కొమ్మలతోటి ఆడి**
**అదే చెట్టు కింద మట్టిబొమ్మకతోటి ఇల్లు గట్టి**
**నాది చాలా పెద్దిల్లు అని మురిసిపోయేది**
**నేనుండేది గుడిసెలో అని మర్చిపోయి"**

**"పుల్లా పుడక ముక్కున కరచి/ గూడును కట్టితి వోయి/ ఫలించలేదని చేసిన కష్టము / మదిలో వేదన వలదోయి /**

అని మరో కవి నిస్పృహతో అన్నా, ఆ భూమిని అమ్మేస్తారంటే కలిగే ఆవేదనను ఇంద్రాణి కవిత్వీ కరించిన తీరు ఆ జ్ఞాపకాలను వెలకట్టలేనివిగా చేసుంది.

చిన్న నాటి జ్ఞాపకాల్లో ఒక జ్ఞాపకం కాదు ఇల్లంటే! అది అద్దె ఇల్లే కావచ్చు. అదే ఒక మధుర జ్ఞాపకం జీవితంలో! సొంతిల్లైతే అదెంత చిన్న ఇల్లైనా కావచ్చు . దానికోసం తల్లిదండ్రులు పడ్డ శ్రమ పిల్లలు చూసి వుంటే, తమకో నీడ కల్పించి తానే లేకుండా పోయిన తండ్రి జ్ఞాప కాలు ఇంట్లో అడుగ డుగునా ఎలా కనిపిస్తాయో, అనిపి స్తాయో "సొంతిల్లు" అనే కవితలో చూడండి:

**"ఒక్కొక్క ఇటుక గోడకు**
**మా సొంతింటి కలల నీటిని**
**పోసినం**
**మా బాపు చమట నీటిని పోసిండు**
**మా ఇంటి ప్రతి గోడకు ఒక ఇటుక ఆయన పెట్టిందే**
**ఇక సిమెంటు ముద్ద ఆయన కల్పిందే...**
**ఇంటి స్థంబాలకున్న ఇనుప సలాకలు**
**మా బాపు పట్టుదలకు గుర్తు"**
**"ఇంటి ముంగట కూసున్న ముగ్గు**
**ఆయనిచ్చే ఆతిథ్యం**
**పసుపు పూత రాసుకున్న ఇంటి గడపలు**
**అందరినీ పలకరించే మా బాపు చిరు నవ్వులు**
**మా ఇంటి పచ్చ తోరణాలు ఆయన దీవెనలు**
**మా ఇంటి అష్ట దిక్కులూ ఆయన జ్ఞాపకాలే !"**

కష్టాలమయమైనా జీవిత కథలో మరో మధుర జ్ఞాపకం వీధి బడిలోనిదే కావచ్చు, పూరి పాకలోనిదే కావచ్చు, చెట్టు కిందనే కావచ్చు చదువు చెప్పిన తొలి గురువులు. వాళ్ళ జ్ఞాపకాన్నీ, వాళ్ళ పట్ల కృతజ్ఞతా భావాన్ని ఎంత లోతైన మాటల్లో చెబుతున్నదో చూడండి "హాప్పీ టీచర్స్ డే" కవితలో:

**" మా టీచర్లు ఎదురు చూస్తూ ఉంటారు**
**ఈ రోజు మా పలకరింపు కోసం...**
**మాకేమైనా కష్టాలుంటే మళ్ళీ మాతోటే**
**జవాబులు రాయిద్దామని...**
**వారి దగ్గర దోసిలి నిండా అక్షరాక్షింతలను**
**అరువుగా తీసుకొని**
**తెలివిని ఎరువుగా వేస్తే**
**ఈ రోజు ఆ అక్షింతలకు లక్షింతలైన తరువులు**
**బలమైన వేర్లతో నిలదొక్కుకున్నాయి...**
**వీలైతే ఇంకోసారి వారి చేత**
**లొట్టపీసు కట్టె దెబ్బలు తినాలనిపిస్తది**
**జీవితపు ఓనమాలు మళ్ళీ నేర్వాలనిపిస్తది**
**టీచర్లను గుర్తించడానికి మాత్రమే కాదు**
**మేమెప్పుడూ నిత్య విద్యార్థులమే అని**
**గుర్తుంచుకోవడానికి".**

ఎవరికైనా జీవితం లో మరో మధురానుభవమేవిటి? చిన్నప్పటి ఆటా పాటా. "గుర్తుకొస్తున్నాయి" కవితలో...

**"ఆటలాడితే మా బట్టలు మట్టి తోటి**
**పెయింటింగ్ వేసుకునేవి .**
**వానాకాలం మాకిచ్చే జలుబు**
**మేం వానలో తడుస్తూ చేసిన**
**కాగితపు పడవలకు సాక్ష్యం.**
**కోలాటమాడితే మట్టలు పలిగిపోయినా**
**పాట ఐపోయేదాక ఆటను ఆపినమా?"**

చిన్నతనంలో పరిసరాలన్నీ ఆట స్థలాలే! ప్రకృతంతా ఆట వస్తువుల మయమే! అన్ని జీవులూ తోటి ఆటగాళ్ళే! స్నేహితులే! సన్నిహితులే! ఊహ కూడా తెలియని పసి వయసులో తెలిసీ తెలియనితనం కలిగించే ఎంత చక్కటి భావన అది ! పెద్దయ్యే కొద్దీ ఒక్కోటీ పోగొట్టుకుంటున్నామని తెలిసినా తిరిగి వాటితో అప్పటిలా మమేకమవనివ్వదు జీవితం. బాధ్యతాయుత జీవితం లో పడిపోయాక చిన్నప్పటి మధుర స్మృతులతో జీవన యానాన్ని ఎంతో కొంత ఉత్సాహభరితంగా చేసుకోవడమే మనం చేయగలిగింది. "నా చిన్నతనం నాకెన్ని పెద్దరికాలు నేర్పిందో"

అనే ఎరుక ఎంత గొప్ప తృప్తినిస్తుందో కదా !

.....,,

**"కోడిపిల్లలు, కుక్క పిల్లలు, పిల్లి పిల్లలు, ఆవు దూడలు**
**చివరకు పురుగులు కూడ మాకు స్నేహితులే, సన్నిహితులే**
**నా చిన్నతనం నాకెన్ని పెద్దరికాలు నేర్పిందో!**
**అప్పుడు జీవితం అంత బాగుందని అర్థం కాలేదు**
**ఇప్పుడు అర్థమైనా మళ్ళీ అక్కడికి జీవితం వెళ్ళదు".**

పేదలైనంత మాత్రాన స్నేహితులుండరా? ఎవరికి దగిన స్నేహం వారికి దొరుకుతుందనే సర్దుబాటు మాట కాదు ఇంద్రాణి చెబుతున్నది. ఎటువంటి వాళ్ళను స్నేహితులం టారో "స్నేహితం" కవితలో...

**"నా వల్ల కాదు ఇగ**
**అని నా మెదడు నాతో మొరపెట్టుకున్న ప్రతిసారీ**
**వారి చేయి నన్ను మొట్టికాయలు కొట్టి లేపుతుంది**
**నేను మౌనంగా ఉంటే**
**నా ఫోను రింగై మోగి నన్ను మాట్లాడిస్తరు**
**నా జీవిత ప్రయాణం లో వాళ్ళు నాకు రోడ్డు సిగ్నల్లు**
**నన్నెక్కడా తప్పిపోనివ్వ లేదు**
**వెనక్కి రానివ్వ లేదు."**

ఇప్పటి జీవితానికి సరిపోయే ఎన్ని కొత్త ఉపమానాలు. ఎంతకొత్త వ్యక్తీకరణ!

అడుగడుగునా వెతలే ఎదురొస్తున్నా వాటిని నిశ్చల మతితో దాటాక గడిచిన రోజుల జీవిత కథలో మరో మధురానుభవమేవిటి?

వయసుతో పెరిగే మనసు కోరుకునే ప్రేమ. ప్రేమ విఫలమా, సఫలమా అనేది కాదు ముఖ్యం. "వలచి విలపించినా మేలు. వలపన్నదే లేని బ్రతుకు కన్నా అని ఒక కవి అన్నట్టు ప్రేమనెంత పరిణతితో చూడాలో "తుమ్మెద ఎద" కవితలో...



ప్రతులకు: **మామిడిపెల్లి ఇంద్రాణి**
సెల్: 7287919385

### మామిడిపెల్లి ఇంద్రాణి రచించిన "ఇంద్ర-కమలం" వచన కవితా సంపుటికి డా॥అంగలకుర్తి విద్యాసాగర్ రాసిన ముందు మాట

**"ప్రేమానుభూతి నాక్కూడా ఉందని**
**నీలోని పుప్పొడి మాధుర్యం నాకు గుర్తు చేసింది**
**నా తనువంతా పారే ఈ ప్రేమ గంగకు**
**నీ కుసుమ హృదయం గంగోత్రి వంటిది**
**ఇంద్ర ధనసు రంగులన్నీ నీ ముఖాన దిద్దుకొని**
**నన్ను ఒడిసిపట్టి నిన్ను వదిలి వెళ్ళనివ్వవు.**
**కానీ ఇప్పుడు నీ దగ్గరికి రావడం కుదరడం లేదు**
**నువ్వు కూడా నా గురించి పడిగాపులు కాసి**
**వికసించడం మానేస్తావో ఏమో....**
**నువ్వలా చేయకు**
**మనుషులు వాళ్ళ ధర్మం తప్పినా నువ్వు తప్పకు**
**నువ్వు ప్రకృతి**
**పూయడం నీ హక్కు, నీ అస్తిత్వం".**

పర్యావరణ విధ్వంసం వల్ల తుమ్మెదల జాతి అంతరిస్తే పూలు వికసించినా ఎలా నిష్ప్రయోజనమో అలా ప్రేమను సందేహించి, ప్రేమను కించపరచి, ప్రేమకు పరువునంటగట్టి ప్రేమికులను సమాజం ఎలా హింసిస్తుందో, విడదీస్తుందో చెప్పడానికి కొత్త ఉపమానాన్ని పరిచయం చేశారు ఇంద్రాణి.

**'తుమ్మెద ఎద'** పేరుతో అన్యాపదేశంగా చెప్పినా అందులో ఉన్న ధ్వని ఒక కొత్త వ్యక్తీకరణ.

ప్రేమ ఫలించక పోయినా ప్రేమ విఫలం కాదనే భావనను, విఫలమైనా ఒకరి క్షేమమింకొకరు సదా కోరుకోవడమే ప్రేమ అంతర్యమంటూ ...

**"మళ్ళీ మనం కలవక పోతామా**
**ఒకవేళ కలవక పోయినా**
**మనిద్దరి బంధం ప్రకృతి బంధం**
**నువ్వు పదిలం సుమా!"** అని సాంత్వన వాక్యాలు పలుకుతోంది.

కష్టాల మయమైన జీవిత కథలో మరో తీయని వేదనా భరిత జ్ఞాపకం తొలి ఉద్యోగ ప్రయత్నం. దాన్నే ఈ రోజుల్లో **"కాంపిటీటివ్ ఎగ్జాం"** అంటున్నాం. వందల్లో ఉండే వుద్యోగాలకు లక్షల మంది పోటీ పడే విధిలేని ప్రయత్నం. దానికి తోడు పేదరికం వెంటాడుతుంటే జీవితం నిత్య పోరాటమే! ఆ పోరాటానికి ఆసరా భవిష్యత్తును గురించి రంగుల కల. కానీ పూట గడవడానికి వెతుకులాటలో ఆ రంగుల కల మసకబారే అవకాశమే ఎక్కువ. ఇంద్రాణి మాటల్లో ...

**"మాది రంగుల జీవితం**
**కానీ నలుపు రంగే ఎక్కువ డామినేట్ చేస్తది.**
**నవరాత్రులు తొమ్మిదే ఎందుకున్నై?**
**ఇంకొన్ని రాత్రులుంటే ఇంకొన్ని రుచులు చూసెటోల్లం గదా**
**అని ఎన్ని సార్లు అనుకున్నామో**
**ఐదు రూపాయల అన్నానికి మా జేబు నుండి**
**ఎన్ని ఐదు రూపాయల బిళ్ళలు మాయమైనాయో!"**

ఇన్ని పాట్లు పడి ఎగ్జాం పాసైతే ఆ బాధలే తీపి జ్ఞాపకాలు.

ఒక మనిషికి మానవీయ స్పృహ కలిగిన వ్యక్తిత్వాన్నివ్వ డానికి కేవలం తల్లిదండ్రులు, తోబుట్టువులు, స్నేహితులు మాత్రమే చాలరట. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వూరు వూరంతా కలిసి తనను తీర్చిదిద్దుతుందట. తమ జీవన విధానం తోనే పెద్ద తరం లో కొందరు జీవిత పాఠాలు నేర్పిస్తారు. అలాంటి ఇద్దరు వ్యక్తులు ఇంద్రాణి జీవితం లోకి వచ్చారు. వాళ్ళిద్దరూ తన సొంత వాళ్ళే! ఐనా సొంత వాళ్ళ నుంచి సైతం నేర్చుకునే లక్షణం అందరికీ అంత సులభంగా అలవడదు. వాళ్ళున్నప్పుడు వాళ్ళ విలువ తెలియక పోవడమే దానిక్కారణం. తండ్రీ, తాత పోయాక వారినుంచి ఇంద్రాణి గ్రహించిన విలువలు మహత్తరమైనవి. తన తండ్రికి తన తల్లిమీద ఉన్న నమ్మకం ద్వారా భార్యను గౌరవించే భర్త తన పిల్లలకు స్త్రీ పట్ల గౌరవం కుటుంబానికి రక్షణ కవచమని చెప్పకనే చెప్పాడు.

**"మా బాపుకు మా అమ్మంటే ఎంత నమ్మికనో"** కవితలో:

**"ఎప్పుడూ అంతే**
**మా బాపుకు మా అమ్మంటే మస్తు నమ్మకం**
**మాకెంత కష్టమొచ్చినా మా అమ్మ ఉన్నదని**
**మా బాపుకు మస్తు నమ్మిక**
**ఎంతంటే...**
**ఇప్పుడు మళ్ళా మా బాపు**
**మనవడై మా అమ్మ ఒళ్ళోకి చేరిపోయిండు"** అని అంటున్నది.

నిత్య శ్రామిక జీవనం ఎందరికి ఎన్ని ప్రయోజనాలుగా రూపు దిద్దు కుంటుందో తన తాత జీవితం నుంచే గ్రహించింది "తెల్ల సుట్ట బట్ట" కవితలో:

**"తాతా, నీ ముడతలు నిండిన ముఖంలో**
**నిండు పెద్దరికమే గుర్తుకొస్తది**
**ఆ ముడతల సందులల్ల నీ కష్టపు చెమట**
**ఎన్ని వాగుల లెక్క పారిందో**
**నీ చేతి కళకు ఎన్ని కుండలు నీకు బిడ్డల్లోలే పుట్టినయో**
**ఎన్ని గరిబుడ్లు ఎంత మంది లగ్గం చేసినవో**
**పుట్టెడు కురాడు కుండలు ఇండ్లల్ల**
**ఆడబిడ్డలెక్క ఆడుకుంటున్నయి.** అని అంటున్నది.

కరోనా కాలం లాంటి విపత్కర సమయం లో విలయాన్ని తప్ప మరో కోణాన్ని ఎంత మందిమి చూడగలం? ఇంద్రాణి కవిత చూడండి. అదెలా సాధ్యమో తెలుస్తుంది.

'రా కరోనా రా' అని పిలుస్తోంది. ఎందుకు?

**"విదేశాల్లో ఉండే నా పిల్లలు**
**వ్యాపర వ్యసనం లో వస్తువైన నా భర్తను**
**నా ముసలి తనంలో నా దగ్గరే ఉంచి**
**నాకెంతో మేలు చేసిన మంచి మహమ్మారివి నువ్వు**
**ఈ నాలుగు నెలలు బయటి ప్రపంచాన్ని మరిచాను"**

అన్నీ ఉన్నా తన కుటుంబ సభ్యులెవరూ తనతో లేరనే ఓ స్త్రీ ఆవేదనకు కరోనా మహమ్మారి తాత్కాలికంగానైనా ఊరటనిచ్చిందని చెప్ప డం కుటుంబ జీవితం అంటే ఎప్పుడూ నలుగురు నాలుగు దిక్కులా పరిగెత్తుతూనే ఉండే పరుగు పందెం కాదనే సూచన అందులో ఉంది.తాను చూసిన జీవితం నుంచి నేర్చుకున్న పాఠాలకు, ఆ పరిస్తితులకు నేరుగానే కారణమైన మన దేశంలోని సామాజిక, ఆర్థిక, పరిపాలనా స్థితిగతులను తనదైన శైలిలో కవిత్వీకరించిన ఇంద్రాణి స్వతంత్ర దేశంగా మారిన అమెరికా తొలిరోజుల్లో అక్కడి సామాన్యుల జీవనాన్నీ త ద్వారా రూపు దిద్దుకుంటున్న ఒక కొత్త సమాజాన్నీ కవిత్వీకరించిన వాల్ట్ విట్మన్ ను గుర్తుకు తెస్తున్నది.బాధలను అనుభవించేప్పుడు కలిగిన భావా లు ఎలా కవిత్వమైందో " ఓ కవితా" అనే కవిత ద్వారా కవిత్వం మీద కవిత్వం చెప్పిన కవుల వరసలో ఇంద్రాణి కూడా తొందరలోనే చేరిపో యారు.

**"నేను ఏడిస్తే నా కన్నీటి చుక్క ఒక్కో అక్షరంగా మారితే**
**నువ్వు రూపు దిద్దుకుంటావు**
**నేను నవ్వితే... ఆ సంతోషపు సందుల్లోంచి జారిపడి**
**కాగితం మీద కనబడతావు**
**నిన్ను రాసేటప్పుడు నా ఆలోచనలు పురిటి నొప్పులు పడతాయి**
**నీలోని అక్షరాల పేగుని తెంచుకొని**
**నీకే నేను బిడ్డగా పుట్టి మరో పుట్టుకను సంతరించుకుంటాను"**అని అంటూనే

**"నేను రాస్తే పుట్టిన నువ్వు నాకు బిడ్డవో**
**నిన్ను రాస్తే కొత్తగా అనిపిస్తున్న నేను నీకు బిడ్డనో"**

అని ఒక చిత్రమైన సందేహాన్ని వెలిబుచ్చి రాసే వాళ్ళందర్నీ ఆలోచింప జేస్తున్న ఇంద్రాణి జీవన గమనంలో కవిత్వపు ఆనవాళ్ళు గుర్తుంచగల ధీర గంభీరమైన మనసుంది. ఆ మనసు నామె కాపాడుకుంటే ఆ మనసే ఆమెను మార్గ దర్శకురాలైన కవిగా నిలబెడుతుంది .

చివరిగా తప్పని సరైన ఒక మాట. కవిత్వానికి భావం, భాష, నిర్మాణం సమాన భాగస్వాములు. ఇంద్రాణికి భావ సంపదకు కొరత వుండే అవకాశం లేదు. కవితా భాషను ఇంకా మెరుగు పర్చుకోవాలి. నిర్మాణం పట్ల పూర్తి శ్రద్ధ పెట్టాలి.ముందు ముందు రోజుల్లో ఆ మూడింటి మేలు కలయికతో మరెన్నో మంచి కవితా సంపుటాలు తేవాలని మనసారా కోరు కుంటున్నాను.



ఈ వారం అంశం: పెండ్లి
పేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో డా. రావి రంగారావు 2024 నుండి నిరంతరాయంగా నిర్వహిస్తున్న వారం వారం కవితల వర్క్ షాపులు.
"వారం వారం కవితల వర్క్ షాప్" 43కు మొత్తం 16 మంది కవులు తమ కవితలు పోస్ట్ చేశారు. 7 కవితలకు ప్రశంసా పత్రాలు లభించాయి.విజేతలకు అభినందనలు. -సంపాదకులు

-డా॥రావి రంగారావు
9247581825

## పెండ్లి

ఒంటరి తోడుకు జంటై వచ్చి
బతుకు తోటలో మమత పండించేది పెండ్లి,
పరిమళాలను ప్రతిబింబిస్తూ
సాగించే జీవనయానం పెండ్లి...
నిరుత్సాహం నిస్సహాయతలో
బలమైన ఆయుధం పెండ్లి
అనుబంధాల అనుభూతులను
రసాస్వాదనగా మలిచేది పెండ్లి...
శోధనలో సాధనలో
ఒకరితో ఒకరు ముడిపడి
సముద్రపు అలల హోరునైనా
ఈదగలిగే సత్తానే పెండ్లి...
జీవన గతి తప్పకుండా
విశ్వాసాలను
రహదారిగా వేసుకుంటే
కాలగతినే నడిపిస్తుంది పెండ్లి...
అరమరికలు లేకుండా
చిరునవ్వుల సౌరభాలను
నాటు వేసి నీరు పెడితే
మహా వృక్షమై పెరుగుతుంది పెండ్లి...
తుపాను లాంటి కల్లోలంలో
చిక్కుకొన్నా ప్రవహించగలిగేది,
మలయ మారుతాల జోరులో
హుషారుగా జీవించేది పెండ్లి.

**-చల్లా సత్యవతి**

## మా పెండ్లి

మా ఇద్దరి కోసం
అందంగా అలంకరించి
పడవను సిద్ధం చేశారు...
ఇద్దరకు సరిపోని
ఇరుకు మంచాన్ని
ఒకటి వేసి సర్దుకోమన్నారు...!
మాపై దయతో రేపటి కోసం
రెండు బుల్లి బుల్లి కుర్చీలు
పక్కన వేశారు....!!
"జీవిత నది"లో పడవ ప్రయాణం
భలే కులాసా అని చెప్పారు....!
కులుకుల కూని రాగాలు
వలపుల వంకరలు,
సరసాల సయ్యాటలే అనుకున్నా.....
అలకల అలలు,
గెలుపుల మలుపులు
సర్దుబాట్ల సుడిగుండాలు
అక్కడక్కడ తారసపడ్డాయి...!.
పక్కన "ప్రేమ" తెడ్లను ఏర్పాటు చేసి
సుడిగుండాల కడగండ్లను
వడివడిగా దాటమన్నారు...!.
మాకు అలుపొస్తుందని
ముందే తెలుసో... ఏమో..
"ఓరిమి"తెరచాపను సిద్ధం చేశారు...
గాలి వాటం చూసుకుని
పయనం సాగించమని....!.
అలా.. అలా...సాగుతూ ఉంటే..
ఆకలేస్తుందని అర్థం అయ్యింది..
స్థిమితపడి చుట్టూ చూసే
నూలు పోగులు దొరికాయి..
అప్పటికి గానీ అర్థం కాలేదు...
"వల" అల్లుకోమని
పెద్దలు చేసిన ఏర్పాటు అని...
కానీ చేపలు పట్టడం నేర్పినోళ్ళు కాదు..
"ఆకలి" అన్నీ నేర్పుతుందని
వాళ్ళ ఉద్దేశం కాబోలు....!.
కానీ
పెద్దల మాట వినక...
ఏదో "తోడు" చూసుకుని....
హడావుడిగా .....
సాగే పడవని ఎక్కేస్తే...
అది ఏదరి చేర్చేనో...

**-శంకర్ ఆశోది,** బాపట్ల

## పెండ్లి

పుట్టింట మొలచిన
పేగు బంధాన్ని
మెట్టినింట పవిత్ర బంధంగా అల్లుకోమని
నిర్ణయించే శుభ ముహూర్తమే పెళ్లి.
ఒంటరి చీకట్లను తరిమికొట్టేందుకు
జంటగా వెలుగుల తోడును
వెంటబెట్టుకొచ్చే దీపావళి పండుగనే పెళ్లి.
కష్టసుఖాలలో సగభాగం కానున్న
ఇష్ట సఖిని ఊహల పల్లకిలో ఊరేగించే
తీయని వేడుకనే పెళ్లి.
ఎప్పటికీ వీడని చిక్కుముడిలా
జతపడమని మూడు ముళ్ళతో
ముడిపెట్టే బలమైన బంధమే పెళ్లి .
తప్పటడుగులకు తావివ్వమని
ఒకరికొకరు తోడుగా ఏడడుగులతో
మొదలెట్టే ప్రేమ ప్రయాణమే పెళ్లి.
సచ్చేదాకా వదిలేది లేదంటూ
ఇచ్చిన చేతిని గట్టిగా పట్టుకునే
నిండు నూరేళ్ల నమ్మకమే పెళ్లి

**-టి. ధనుంజయ రెడ్డి,** గుంటూరు.

## పునాది రాళ్లు..

రెండు తనువులా
రాగమొక్కటై..
రెండు మనసుల
గానమొక్కటై...
ఇరు హృదయాల
భావమొక్కటై..
ఇద్దరు మనుషుల
ధ్యేయ మొక్కటై.
ఇరువురిని కలిపే
బంధ మొక్కటై..
కష్టమొక్కటై
కరుసు ఒక్కటై..
అర్ధమొక్కటై
అర్థమొక్కటై..
పలకరించు
ప్రతిభింబమొక్కటై..
నాలుగు కన్నుల
భాష ఒక్కటై..
నాలుక పలికే
మాట లొక్కటై..
వేసే అడుగుల
నడక ఒక్కటై..
నడుస్తున్న
ఆ దారి ఒక్కటై..
కోప తాపముల
తీరు ఒక్కటై...
శాంతిచర్చలకు
చంద్రుడొక్కడై..
నడిచే నడకల
నడత ఒక్కటై...
జగడపు గొడవల
తీరు ఒక్కటై...
ఎలపట దాపట
శక్తులొక్కటై...
లాగేబండికి
ఇరుసు ఒక్కటై...
ఇద్దరొక్కటిగ
ఒక్కరిద్దరుగ
వడిదుడుకులను
ఒడుపు తెలిసి
గెలుపొందాలని..
కలకాలం
కలిసుండాలని..
వేసే పునాది రాళ్లె పెళ్లి...

**-మేడిశెట్టి యోగేశ్వరరావు**

## సంధి

వాగ్దానాల వర్షంలో
తడిసిన కలలు,
మంగళసూత్ర లయలో మోగిన
రెండు మనసుల సంగమమే పెళ్లి.
వేదమంత్రాల మధ్యలో
ఆశల ఆకాశం
లఃకొత్తచీర కట్టుకుంది,
పసిడి ముళ్ల కౌగిలిలో
జీవితం కొత్త అర్థం పొందింది.
ఆడపక్షం కన్నీటి నవ్వు,
మగపక్షం గర్వం కలిసిన క్షణం
ఒక పాత "నేను"
ఇక నుండి "మనం" గా మారే
ఘడియ....
పెళ్లి కేవలం వేడుక కాదు,
ఇది మనసుల మధ్య
నిశ్శబ్ద ఒప్పందం....
కష్టంలో కలసి నిలబడి
సంతోషాన్ని
పంచుకునే వాగ్దానం....
ఒకరు పువ్వైతే,
మరొకరు పరిమళం....
ఒకరు మాటైతే,
మరొకరు దానికి భావం....
మూడుముళ్ల క్షణంలో
ఆ ముక్కోటి దేవతల
ఆశీస్సులు,
ఆ ముళ్లను విడదీయకుండా
ఉంచేది సూత్రం కాదు...
మనసుల అర్థం,
హృదయాల సహనం.
ఇదే పెళ్లి రెండు ప్రాణాల
పవిత్ర యజ్ఞం,
కలయికలో సృష్టి,
సృష్టిలో సత్యం,
సత్యంలో ప్రేమ...
ప్రేమలో పరమార్థం...!!
పెళ్లి...

**-నవీన్ హోతా.**

## కణిక



సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న
### 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు

అడ్మిన్: **రమాదేవి కులకర్ణి**
8985613123



నిర్వహణ: **శ్రీమతి సత్య నీలిమ**

### అంశం : చరవాణి

చరవాణి వెలుగుల్లో చిక్కుకున్న పక్షులము
చూపు స్క్రీనుకే పరిమితమైన వారలము
మనసు మాటలు మెసేజ్‌లలో మరిగిపోయి
మనుషుల మధ్య దూరాలు మసక బారి పోయి.
అడుగడుగునా శబ్దాలతో అనుసరిస్తూ
ఆనందాన్నీ, ఆవేదననీ కొలుస్తూ
పిలుపులే నిశ్శబ్దమైపోయాయి
స్పర్శలన్నీ సంకేతాలై మిగిలిపోయాయి.
పాటలోని రాగము పిలుపుగా మారి
పుస్తకంలోని గాథలూ నోటిఫైలో కరిగి
తల్లడిల్లే హృదయానికీ స్టేటస్ లో పెట్టి
తలుపు తట్టే స్నేహానికీ తగ్గిపోయిన కథనం.
వెలగాలి వెలుగులే మన కళ్లలోనే
వెలికితీయాలి నిజాన్ని మన పలుకుల్లోనే
చరవాణి వలలో చిక్కుకున్నా
మనసు వలలో మనిషిని మళ్లీ చేరగలమా!.

**-కాను కొలను వెంకట సుబ్రహ్మణ్యేశ్వర రావు**

## చిలుకల-కొలికి

చిన్నారి చిలుకల కొలికి నా చరవాణి
సూర్యోదయానికి ముందే సుప్రభాతాలు వినిపిస్తుంది
ఏమీ ఎరుగని నంగనాచి కాదు..
ప్రపంచాన్ని ముందుంచే కాణాచి
తాజా సమాచారాలతో అందరినీ
ఆనందపరిచే సకల లోకసంచారి.
అన్ని యాపులను కడుపులో దాచుకొని
కాపు కాస్తున్న కల్పవల్లి కూడా!
దూర భారాల్ని చటుక్కున మాయం చేసీ
మనసును ఆనందింప జేసే దుర్విణి !
ఎందరో అపరిచితులను
కవితా సమూహాలతో
దగ్గర చేసే ఆత్మబంధువు తాను.
ప్రేమికులకు నిద్ర పట్టనివ్వని
పున్నమి వెన్నెలే!
ప్రతి మనిషికి కరభూషణము
తానే కరచాలనమూ తానే!
చీకటి మనసుల్లో
దివ్య వెలుగులు ప్రసాదించే
అఖండ జ్యోతీ తానే!ప
యువత మదిలో మెదిలే
ఊసులకైనా బాసలకైనా
నెట్టింటి నెలరేడు తాను!
అవసరానికి మాత్రమే వాడుకుంటే
అన్నీ నెరవేర్చే అక్షయ పాత్రనే
అమితంగా వాడితే మాత్రం
అతుకుల బతుకు..భవితలు బుగ్గి!!

**-ఆకుమళ్ల కృష్ణదాస్,** నంద్యాల.

## నిత్యావసరం

చరవాణి మోగుతుంది నిశ్శబ్దంలో, జీవన రాగం
పలికిన పదం, చేరుతుంది ప్రాణాంతం వరకు......
తాడు లేని బంధం, ప్రపంచాన్ని కలుపుతుంది
స్పర్శలో స్నేహం, శబ్దంలో హృదయం
దూరమా సమీపమా, తేడా లేదు ఇక
చల్లని కలల్లో, వెలిగే తెర?
కళ్ళలో చూపు, హృదయంలో శ్రవణం
బీటలలోనూ, పాడుతుంది కనెక్షన్?
మాటలకే పూలు, కబురుకే పరిమళం
నిద్రలేని మిత్రం ఇది
రాత్రి పొద్దు లేకుండా, మనసు మెలుకువగా
జ్ఞాపకాల కిరణం, తెరలో జ్వలిస్తుంది
కష్ట సమయమున, సాంత్వనగా మారుతుంది
ఒక కాల్‌లో వాత్సల్యం ప్రవహిస్తుంది
మౌనానికి మాధుర్యం, శబ్దానికి శక్తి
మానవ హృదయానికి ఇది నూతన మాధ్యమం
కనపడి కన్పించని తోడు, చరవాణి
ఆరాటాల అల్లికకి ఆధారం
ఒక నొక్కుతో ప్రపంచమంతా చేరుతుంది
చరవాణి - మనసు నుంచి మనసుకి వంతెన!

**-డా.భరద్వాజ రావినూతల**
కొత్తపట్నం

## మాయా వాణి

ప్రపంచాన్ని చుట్టింది
ప్రజల మధ్య బంధాలు తెచ్చింది
మాయగాళ్లకు నిలయమైంది
మోసాలకు ఆసరా అయింది.
అందరికీ ఆత్మబంధువైయింది
ఆత్మీయుల
పలకరింపులు లేకుండా చేసింది.
ఆటపాటలన్నీ ఆన్లైన్ లోనే
ఆడవారి ఊసులన్నీ చాటింగ్లతోనే
పసిపిల్లలకు ఫోన్ లేనిదే
పాలు రుచించవు.
ఇసుక తిన్నెలలో, ఆరుబయట
స్నేహితులతో ఆడుకోవలసిన
చిన్నారులు నాల్గు గోడల మధ్య
ఆన్లైన్ చదువులు, ఆటలతో
కుర్చీలకే పరిమితమైనారు
ఫలితం బాల్యం నుండే బరువు
పెరగుతూ
ఊబకాయులు అవుతున్నారు.
చరవాణిని క్షేమ సమచారాలు
తెలుసుకోవడానికి రూపొంది
కాలమానంలో
అంచెలంచెలుగా
రూపాంతరం చెంది
అంతా తానై
రోజంతా
చరవాణి చేతిలో ఉండాల్సిందే.
అందరం
చరవాణి చెర ల చిక్కుకున్నాం
అనుబంధాలను
దూరం చేసుకుంటున్నాము.
చరవాణిని ఇకనైనా అవసరం
మేరకు వినియోగించడం
శ్రేయస్కరం.

**-న్యాయపతి శ్రీల**

# కృష్ణదేవరాయల పరిపాలన విశేషాలు




ప్రతులకు: డా॥ పూర్ణచందు
సత్నం టవర్స్,
మొదటి అంతస్తు,
బకింగంపేట్ పోస్ట్ ఆఫీసు,
గవర్నర్‌పేట్,
విజయవాడ-520 002
సెల్: 94401 72642

భువనవిజయం (రాయల నాటి కథలు, గాథలు) రచయిత డా॥జి.వి. పూర్ణచందు తెలుగు భాషోద్యమ నాయకుడు. తెలుగు భాష మరియు సంస్కృతుల మూలాల్ని శోధించి వెలికి తీసిన ప్రముఖుడు. తెలుగు వారి ఆహార చరిత్రను ప్రాచీన గ్రంధాలనెన్నో పరిశీలించి, కావ్యాలను కూలంకశంగా చదివి నాటి సంబంధిత ఆచార వ్యవహారాలు తెలుగు జాతికి తెలియ చేసారు. 6 ప్రపంచ తెలుగు మహాసభలకు కార్యదర్శిగా వ్యవహరించారు. వివిధ అంశాలపై 150 పుస్తకా లను ప్రచురించారు. తెలుగు దేశాన్ని ఏలి, తెలుగు వారి కీర్తిని ప్రపంచ వ్యాప్తం గావించిన కృష్ణదేవరాయల (17-1 -1471- 17-10-1529) పరిపాలనా వైభవం నాడు పరిఢవిల్లిన వజ్రాల పరిశ్రమ, పాలన, వివరాలు ఆయన రాజ్య విస్తీర్ణం నాటి సమాజం, పండుగలు, వారి ఆస్థాన విద్వాంసు లుగా చెప్పబడే అష్టదిగ్గజాలు, భువన విజయ వివరాలు కవులు. ఆయన గొప్ప తనానికి కారకుడుగా చెప్పబడు తున్న మంత్రి తిమ్మరుసు, అంగళ్ళలో నాడు రాసులుగా పోసి అమ్మిన వజ్రాలు-వీటన్నింటినీ విపులంగా ఆధారాలతో డా॥పూర్ణ చందు ఈ గ్రంథంలో తెలియచేసారు.

14 అధ్యాయాలు గల ఈ ఉద్గ్రంథానికి ముందు మాటలు ఆంధ్రప్రదేశ్ సృజనాత్మక మరియు సంస్కృతి సమితి ముఖ్య కార్యనిర్వ హణాధికారి రేగుళ్ళ మల్లికార్జునరావు మరియు తెలుగు రచయితల సంఘం గౌరవాధ్యక్షులు మండలి బుద్ధప్రసా ద్‌గారలు వ్రాసారు.

వివరించబడిన సంగతులన్నీ ఒక్కనాడులోనో ఒక సంవత్సరం లోనో తీరుబడిగా కూర్చుని వ్రాసినవి కావు. ఎన్నో ఏళ్ళనుండి, పరిశో ధిస్తూ, అప్పుడప్పుడు పబ్లిష్ చేసిన పరిశోధనా వ్యాసాలు. కృష్ణదేవ రాయల గురించి నేడు ప్రాచుర్యంలో ఉన్న చరిత్రలో ఎన్నో అపోహలు అసంబద్ధత లున్నాయని, వాటిని తొలగించేందుకు చేసిన ప్రయత్నమే ఈ 'భువన విజ యం' పుస్తకం అంటారు రచయత.

రాయల వారు ఆరాధించిన శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణు కథ వివరిస్తూ ఆంధ్ర విష్ణువు శ్రీకృష్ణుడేనంటారు (1వ అధ్యాయం) రాయల నాటి కాలం, పరిఢవిల్లిన వజ్రాల పరిశ్రమ, ప్రపంచ ప్రసిద్ధి గాంచిన కోహినూరు వజ్రం ఆంధ్ర దేశంలోని కోళ్ళూరులో దొరికిందని, 'కోళ్ళూరు వజ్రం' అన్న పదం రూపాం తరం చెంది కోహినూరు అయిందని చెబుతారు రచయిత (పే.40) రాయల వారి పాలనలో వజ్రాల పరిశ్రమ ఎలా వ్యవస్థీకృతం కావించబడి ఉండేదో రెండవ అధ్యాయంలో తెలుసుకోవచ్చును.

ఆనాటి పరిపాలన భాష, ఆదాయ వ్యయాల లెక్కలు వ్రాసే పద్ధతి (వ్రాయు అనటం సరైంది 'రాయు' అన్న పదం సరైంది కాదు. పే.51) పరిపాలనా భాషలోని ఇల్లరి, కందాయం కరణం కై జీతం, పారెగాళ్లు పుల్లరి బొక్కసం సుంకం లాంటి పదాల వివరణ ఈ అధ్యా యం లో ఇవ్వబడింది.

రాయల ఇంతటి ఖ్యాతికి మూల కారకుడుగా చెప్పబడిన మహామంత్రి తిమ్మరుసు ఆయన జననం కుటుంబ వివరాలు, తిరుమలలో తిమ్మరుసు శేష జీవితం గడపటం రాయలవారు తిమ్మరుసుపై అభిమానం పోగా చూపిన నిరాదరణలోని నిజం ఎంతో (పే.72) ఈ అధ్యాయం వివరిస్తుంది.

కృష్ణదేవరాయల తర్వాత రాయల వారి వంశీకులు ఆనెగొం దిలో స్థిరపడటం, రాయల వారి రాజ్యం, ముస్లింల (ఢిల్లీ రాజులు, హైదరాలీ వంశీయులు) హస్తగ తం కావటం హంపీ విధ్వంసం 5వ అధ్యాయంలో వివరించ బడింది.

6,7 మరియు 8 అధ్యాయాల్లో రాయల నాటి కాలం కవులు రాయల వారి కూతురుగా చెప్పబడే మోహ నాంగి. ప్రతాపరుద్రుడి కూతురు 'తఖ్ఖాడి' రాయలవారి భార్య ఎలా అయింది. ఆవిడకు, రాయల వారికి మధ్య ఎంతటి ప్రగాఢత ఉండే దో తెలిపారు. మిగతా అధ్యా యాలలో, రచయితకు ప్రీతి పాత్రమైన ఆహార వివరాలు (అధ్యాయం9) నాటి సమాజం, ఆస్థానకవులు, దసరా ఉత్సవాల వైభవం ఇవ్వబడింది.

పూర్ణ చందుగారు ఇచ్చిన ప్రతి వివరానికి ఓ ఆధారం (క్రైఫీయత్‌లు గజెట్‌లు) ఇవ్వటం చాలా బావుంది. ఏళ్ళ పరిశోదన అనంతరం ఈ పుస్తకాన్ని ప్రచు రించానని చెబుతూనే "...రాజుల కథలన్నీ" అనగనగా ఒక రాజు ఉండేవాడట' అంటూ జనంలో 'ట' కార ప్రయోగంతోనే వ్యాప్తిలో ఉంటాయి. ఈ కథల్లో నిజాలకన్నా, కథకుల వ్యక్తిగత అభిప్రాయాలకు ప్రాధాన్యత ఎక్కువ. (పే.99) గొప్పవారి గోత్రాల గురించి జనం అల్లుకునే కథలే ఎక్కువ! వాటిలో రాముడూ-రాజకుడూ కథలు ఉంటాయి (పే.188) అని చెప్పటం రచయిత నిజాయితీకి నిదర్శనం. ఆధారాలు అంతగా లేని నిర్ధారణ లో.. ఒక పాలు నిజం 99 పాళ్ళు ఊహాగానాలు ఉండటం కద్దు. ఏది ఏమైనా రచయిత శోధనా పటిమకు జోహార్లు.. కృష్ణదేవరాయల గురించి తెలుగులో వచ్చిన సంపూర్ణ గ్రంథ రాజం అనదగిన రచన.



-కూర చిదంబరం
8639338675

# సామవేద సారధి



ఉచ్ఛ్వాసం అతని శృతి
నిశ్వాసం అతని లయ
పల్లవులు ప్రాణం
చరణాలు చలనం
సప్త స్వరాల సప్త సాగరాలు ఆగళం
నవరసాల ఆవాసం ఆ గాత్రం
విజయనగర సంగీత కళాశాలలో
వాయులీన మహా విద్వాన్ ద్వారం వారి విద్యార్థి
సంగీత నిధి పాత్రాయని శాస్త్రి వారి విధేయ శిష్యుడు
హరికథా పితామహ ఆదిభట్ల నారాయణదాసుగారి
స్వహస్తాలతో బహుమతిగా పొందిన గాన గంధర్వ
సాహిత్య వారిధి సముద్రాలవారి
గుర్తింపుగొన్న మహా విద్వాన్
తెలుగు చలనచిత్ర త్యాగయ్య ప్రతీక
నాగయ్యగారి ప్రోత్సాహం
నేపథ్యగాన ఆద్యుడై స్వరకర్తయై
తెలుగు తెర సంగీత యుగ పురుషుడుగా
ప్రపంచ శ్రోతల గౌరవాభిమాన గీతాచార్యుడు
వేంకటేశునికే వీనుల విందొనర్చే
ఆస్థాన విద్వాంశుడు
నారద తుంబురుల సంగీత ప్రతినిధి
దేశభక్తి గీతాలతో సాయుధ స్వాతంత్ర్యయోధుడు
శ్రీమతి రత్నమ్మ సూర్యనారాయణ
పుణ్యదంపతి పుత్రుడు
పద్మశ్రీ ఘంటసాల వేంకటేశ్వరరావు
అసలు పేరు గానలోల మారుపేరు ఘంటసాల
ప్రతివాది భయంకర శ్రీనివాస గాయకుల ఉవాచ
శబ్దం ఉన్నంతకాలం ఘంటసాల గాత్రం అమరం
ఇది మనసుకవి ఆత్రేయ మనసు బాస
ఈ శక మరో స్వరార్ణవమైన మాస్టారుకి
భక్తి పూర్వక సవినయ స్వరాంజులులు

(డిసెంబర్ 4 ఘంటసాల జన్మదినం సందర్భంగా...)



- సోమయాజుల సుబ్రహ్మణ్యశర్మ
సెల్: 9346671524

# ఎంఎస్ సుబ్బలక్ష్మి సంగీతసేవలు చిరస్మరణీయం



త్యాగరాయగానసభలో మాట్లాడుతున్న డా॥అయాచితం శ్రీధర్, కళా జనార్ధనమూర్తి

హైదరాబాద్, డిసంబర్ 3: భారతరత్న ఎంఎస్ సుబ్బలక్ష్మి సంగీత సేవలు చిరస్మణీయమని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ మాజీ చైర్మన్ డా॥ అయాచితం శ్రీధర్ అన్నారు.

త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎందరో మహానుభావుల కార్యక్రమ పరంపరలో భాగంగా గత గురువారం నవంబర్ 27న రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కర్ణాటక సంగీత గాయకురాలు భారతరత్న ఎంఎస్ సుబ్బలక్ష్మి యాదిలో గానసభ అధ్యక్షుడు కళా జనార్తనమూర్తి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. శ్రీధర్ మాట్లాడుతూ, 1916లో మధురైలో జన్మించిన సుబ్బలక్ష్మి, పదేళ్ల ప్రాయం నుంచే పాటలు పాడి సంగీత ప్రస్థానాన్ని ప్రారంభించారన్నారు. 1954లో పద్మ భూషణ్, 1968లో సంగీత కళా నిధి బిరుదు పొందిన తొలి మహిళగా లభించాయని వివరించారు. కార్యక్రమంలో విశ్వసాహితీ అధ్యక్షులు జయరాములు, సంఘసేవకులు పిఎస్ఆర్ మూర్తి, కళా పోషకులు వడ్లకొండ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# ఓ మాయమైన మనిషీ!



చిమ్మ చీకటిలో
ఓ మిణుగురు రేకలా
మానవతా సమాధి అవుతున్న
సమాజానికి
వెలుగు దివిటీని వెలిగించి
అర్థాంతరంగా నిష్క్రమించిన
ఓ మనిషీ!
మట్టి పొరలలో పుట్టిన
మాణిక్యానివి నీవు
శ్రమైక జీవన సౌందర్యానికి
చిరునామాగా నిలిచిన ప్రతీక నీవు
బడిబాట ఎరగక
స్వీయ ఉద్దీపనతో
స్వయంకృషితో
పాటల పూదోటగా ఎదిగి
పరిమళించిన సుగంధానివి నీవు
జనం గుండెల్లో పల్లవించిన
చైతన్య జ్వాలవు నీవు
తెలంగాణ అవతరణ ఉద్యమంలో
నీ పాత్ర ప్రశంసనీయం
తెలుగు సాహితీ వనంలో
నీ పాట పదిలం
నీ ప్రస్థానం ఓ ప్రేరణం
అరమరికలు, దాపరికాలు లేని
నీ స్వచ్ఛమైన వ్యక్తిత్వం
నేటిసామాజిక జీవనంలో
అపురూప మణిదీపం
నీ పాట అజరామరం
నీ జన్మ ధన్యం..
(అందెశ్రీకి
నివాళిగా....)



-డా॥సమ్మన్న ఈటెల
సెల్:9885238654

## పుస్తక సమీక్షలు

# సృష్టికర్త శతకం-తుమ్మోజు రామలక్ష్మణాచార్యులు




ప్రతులకు:సంకృతి పబ్లికేషన్స్
501, వినాయక రెసిడెన్సీ
పద్మావతి గార్డెన్స్, ఫేస్-2
పోరంకి-
విజయవాడ-521137
9959407672

సృష్టికర్త అయిన విశ్వకర్మ, ఆది వరాహమై పృథ్విని పైకెత్తిన దృశ్యం ముఖ చిత్రంగా తుమ్మోజు రామలక్ష్మణాచార్యులు రచించిన సృష్టికర్త శతకం వేదోపనిషత్తుల, మంత్ర సారాన్ని పరమాత్మ తత్త్వస్వరూపాన్ని పరమోత్కృష్టంగా దర్శింపచేస్తోంది. ఆటవెలది పద్యాలలో తేట తెలుగులో అత్యంత తేలికగా అర్థమయ్యే రీతిలో 116 పద్యాలు ఈ శతకంలో సృష్టికర్త. విశ్వ కర్తృత్వాన్ని విశదం చేస్తున్నాయి. 'విశ్వ సృష్టికర్త విశ్వకర్మ' మకుటంతో, వేద ఉపనిషత్ మంత్ర అధ్యయన అభినివేశ ప్రతిభా సమన్వితంగా ఈ శతక పద్యాలు ఆకట్టుకుంటున్నాయి. వేదంలో నిర్దేశించబడిన సృష్టి క్రమం, దేవతోత్పత్తి క్రమానికి భిన్నంగా పురాణ కథలు, అసలు పరబ్రహ్మ తత్త్వాన్ని గందరగోళం చేసి అన్యమతాల ప్రాభవానికి ఆస్కారం కలిగించాయని పురాణ కట్టుకథల పౌరాణిక మాయాజాలం తొలగించి, విశ్వకర్మ మహా సంకల్ప బలిమే ఈ సృష్టి సర్వస్వమని గ్రహించాలని ఈ శతకం ప్రతిపాదిస్తోంది.

శిలను తీర్చిదిద్ది శిల్పం చేసి రాయి దైవంగా వెలసిన తొలుత దైవదూపం, శిల్పి సృష్టించాలని, శిల్పకర్మలంటే సృష్టికర్మలేనని విశ్వ సృష్టికర్త, విశ్వకర్మ అని కవి ప్రగాఢంగా విశ్వసిస్తాడు. విశ్వ నిర్మీణ చేతనా రూపాన్ని దైవంగా, నిర్మాణ సంకల్పం విశ్వకార్యంగా నిరూపించటం లక్ష్యంగా అనుభవైక వేద్యంతో కవి తుమ్మోజు రామలక్ష్మణాచార్యులు ఈ శతక పద్యాలు సృష్టించారు. శతకం లోని పద్య అంతరార్థ భావనలకు ఆధార భూతమైన వేద, ఉపనిషత్, మంత్రాలను పద్య పాదపీఠికలుగా ఉల్లేఖించటం కవి పాండితీ వైదుష్యాన్ని వ్యక్తం చేస్తోంది.

**"పుట్టు చరిత వదిలి కట్టు కథలు చెప్ప**
**పట్టు వదలి పోద పరమ పథము**
**పథము తప్పి జనులు పలు దారులను బోరె?"**

అంటూ **"ప్రజల మనసునందు ప్రత్యక్ష సాక్షివై"** చోద్యం చూస్తూ వుండకుండా **"దుష్టజనుల కీవు శిష్టమార్గాన్ని చూపమని"** విశ్వకర్మను, తుమ్మోజు రామలక్ష్మణాచార్యులు అర్థించటంలో సామాజిక ప్రయోజనం ద్యోతకమవుతోంది.



-జయసూర్య
9440664610

# నానీలు

పసిడి
మిడిసి పడుతుంది
పసిడి బాల్యం
మసిబారి పోతుంది!.

రైతన్నలంటే
కపట ప్రేమ
రైతుల బ్రతుకు
ఎండమావి భ్రమ!



-ఎం.ఏ.గఫార్
సెల్:9490324834
9490975242

భవభూతివి
కావాలనుందా!
అయితే చదువు
రైతు జీవితం.

ఉచిత పథకాలు
ఒట్టి నాటకం
ఉపాధి పథకాలే
సముచితం.

రైతన్న చేతులకవి
ఉంగరాలా?
కాదుకాదు
కష్టాల కాయలు.

ఏలే వారికి
ఎంత చెవుడో!
రైతుకేకలే
వినపడవు మరి!

మట్టినీటితో
తడవడమంటే..
మనిషి విజ్ఞానంతో
చెమ్మ గిల్లడమే!.



-కొండ్రెడ్డి వెంకటేశ్వర్లు రెడ్డి
సెల్ 99487 74243

ఏది కలకాలం
మనతో ఉండదు
మరీ అంతగా...
అనుబంధం పెంచుకోకు!

టేస్ట్ కోసం
ఫాస్ట్ ఫుడ్
దిమ్మతిరిగే టెస్టులతో..
రోగి బతుకు రోస్ట్ "

ఎగిరినవి
ఎగిరిపోగా
గూటిలో మిగిలినవి..
రెక్కలలిసిన పక్షులు!

అకాల వర్షం
నెలవాలిన వరి
కల్లలవుతూ.. కల్లాల్లో
రైతు కలలు!



-ఎస్. ఎం. సుభాని
9490776184

## రెక్కలు

ప్రలోభాల వలలు
ఆకర్షణావలయాలు
తాకలేవు
నిరాడంబరుని
పెకలించలేవు గడ్డిపోచని
తుఫానులు.

డబ్బే సర్వస్వం
అయినవాడు
చివరికి నాలుగుభుజాలు
సమకూర్చుకోలేడు.
వెలకట్టలేనివి
విలువలు.



-పి.శ్రీనివాస్ గౌడ్
9949429449

# ఆణిముత్యాలు-స్ఫూర్తి కిరణాలు




పుస్తకం:
చౌడూరి నరసింహారావు
9705100788

ఉక్తి అనగా మాట. సూక్తి అనగా మంచి మాట అని అర్థం. చక్కగా చెప్పబడిన, మనల్ని ఆకట్టుకునే మాటలు లేదా వాక్యాలను సూక్తులుగా భావిస్తాము. ఇవి క్లిష్టమైన ఆలోచనలను, భావనలను, విషయాలను సులభమైన భాషలో తెలియజేస్తాయి. నీతి లేదా జీవితానికి, సమాజానికి సంబంధించిన సత్యాలను , విలువలను అందిస్తాయి. ఇవి ఆకర్షణీయంగా ఉండి, సులభంగా గుర్తుంచుకోవడానికి వీలుగా ఉంటాయి ఎందుకంటే ఇవి క్లిష్టమైన విషయాలను సాధారణ పదాలలో వివరిస్తాయి.

ప్రస్తుతం భారతదేశం అనేక రంగాల్లో గణనీయమైన ప్రగతిని సాధించిందనడంలో అతిశయోక్తి ఏమీ లేదు. అక్కడక్కడ జరుగుతున్న అమానవీయ, అవాంఛనీయ సంఘటనలు చూస్తుంటే సంస్కారంలో , విలువలు పాటించడంలో ఇంకా మనం ఎదగాల్సి ఉందని తెలుస్తుంది. ఇదే విష యాన్ని కవి చౌదూరు నరసిం హారావు తన ముందుమాటలో తెలిపారు. స్ఫూర్తి కిరణాలు రచయిత చౌదూరు నరసింహారావు గారు ప్రముఖ కవి, పత్రికా రచయిత, విమర్శకుడు, వక్త ,వ్యాఖ్యాత, గాయకుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు, ప్రవచనకర్త. గతంలో అమృత వర్షిణి ,ఆణిముత్యాలు, నవ కవి రత్నాలు గ్రంథాలను ప్రచురించారు. ప్రస్తుత వీరి రచన స్ఫూర్తి కిరణాలను పరిశీలిద్దాం.

స్ఫూర్తి కిరణాలులోని సూక్తులు లేదా సుభాషితాలు అన్నీ కూడా చౌడూరి అమృత వాణి చౌడూరి చాటు రత్నావళి పేర్లతో వివిధ మాధ్యమాలలో ముఖపుస్తకంలో ప్రచురించబడి పలువురిచే ప్రశంసలు పొందాయి. ఈ పుస్తకానికి ప్రముఖులు ఆచార్య శ్రీ యస్వీ. రామారావు, డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణ ,శ్రీ గన్నమరాజు గిరిజ మనోహర్ బాబు మరి యు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం పూర్వ రిజి స్ట్రార్ ఆచార్య గౌరీ శంకర్ గారు ముందు మాటలను అందించారు. యువతలో స్థైర్య ధైర్యముల నింపి, స్ఫూర్తి వంతమైన ప్రసంగములతో ఖండ ఖండాంతరాలను ఉర్రూతలూగించిన భారతాంబ ముద్దుబిడ్డ, మనందరికీ స్ఫూర్తి ప్రదాత శ్రీ వివేకానంద స్వామికి స్ఫూర్తి కిరణాలు అంకితం ఇవ్వడం విశేషం.

దేవతల ప్రార్థనతో ప్రారంభమైన స్ఫూర్తి కిరణాలులో బాలలకే కాదు పెద్దలకు కూడా ఉపయోగపడే అనర్ఘమైన రత్నాలు ఎన్నో ఉన్నాయి.

**"ఎన్నో ఓటములను**
**మరచేలా చేస్తుంది విజయం**
**ఎలా గెలవాలో**
**నేర్పిస్తుంది అపజయం"**

గెలుపు ఓటములు జీవితంలో సహజం. ఓడిపోయినంత మా త్రాన జీవితంలో అన్నీ కోల్పోయి నట్లు కాదు. ఓటమి విజయానికి తొలిమెట్టు అంటారు. గెలిచిన పుడు వచ్చిన ఆనందం గతంలో పొందిన ఓటమి అనుభవాలను మరచేలా చేస్తుంది. ఓటమి కూడా మనకు గెలవాలన్న కసిని, తపనను పెంచుతుంది. అందుకే గెలుపు ఓటములను సమానంగా చూడాలి. అలా చూడగలిగినవాడే స్థితప్రజ్ఞుడు అవుతాడు.

**"నువ్వేంటో నీకు తెలియాలంటే**
**ఒకరికి సహాయం చేసి చూడు!**
**ఒకరేమిటో నీకు తెలియాలంటే**
**వారిని సహాయం అడిగి చూడు!!"**

ఎంత చక్కని మాట... ఎదుటి వారికి సహాయం చేసినప్పుడు మనమేంటో,మన విలువేమిటో

> ప్రస్తుతం భారతదేశం అనేక రంగాల్లో గణనీయమైన ప్రగతిని సాధించిందనడంలో అతిశయోక్తి ఏమీ లేదు. అక్కడక్కడ జరుగుతున్న అమానవీయ, అవాంఛనీయ సంఘటనలు చూ స్తుంటే సంస్కారంలో , విలువలు పాటించడంలో ఇంకా మనం ఎదగాల్సి ఉందని తెలుస్తుంది.

ఎదుటి వారి ద్వారా మనకు తెలుస్తుంది. అలాగే ఎదుటివాడి వ్యక్తిత్వం, లక్షణం తెలియాలంటే వారిని సహాయం అడగాలి. సహాయాన్ని కోరడంలో ఎదుటి వారి గుణగణాలు బయటపడతాయి. అతని వ్యక్తిత్వం ఏమిటో తెలిసిపోతుంది.

సాధారణంగా ఆకాశంలో ఒక పక్షి ఎగురుతూ కనిపించదు. ఒక పక్షి ఎగిరితే మిగతా పక్షులు పైకెగురుతాయి. అందుకే ఎప్పుడు చూసినా పక్షులు గుంపులుగా వెళుతుంటాయి .అది వాటిలో ఉన్న ఐకమత్యానికి ప్రతీక. మనిషి ఈ లక్షణానికి వ్యతిరేకంగా ఉంటాడు. ఒక వ్యక్తి ఎదిగితే అసూయతో, ఓర్వలేనితనంతో అతన్ని కిందకి లాగడానికి ప్రయత్నిస్తాడు. ఈ రెండు లక్షణాలను చక్కగా తెలిపిన సూక్తి స్ఫూర్తిదాయకంగా ఉంది.

"వాదించి మనిషిని
వేధించి మనస్సును
ఎన్నటికీ గెలవలేం" ఎదుటి మనిషిని గెలవాలంటే వాదన కాదు ముఖ్యం. ఎదుటి వ్యక్తిని అర్థం చేసుకొని అతనికి అనుగుణంగా ప్రవర్తిస్తూ మన వైపు తిప్పుకోవడానికి ప్రయత్నించాలి. అలాగే కష్టపెట్టి బాధించి, వేధించి మనసును గెలువలేము. ఎదుటివారి మనసును గెలవాలంటే వారితో మర్యాదగా ప్రవర్తించాలి. అనునయమైన మాటలతో, ప్రేమ పూర్వకమైన ప్రవర్తనతో మాత్రమే ఎదుటివారి మనసును గెలువగలము. ఈ సూక్తి మనం గుర్తు పెట్టుకుంటే మన పనులు సులువుగా జరిగిపోతాయి. సుఖవంత మైన జీవితాన్ని అనుభవించగలము. మనిషికి మనిషికి మధ్య పొరపొచ్చాలు లేనప్పుడు సమాజం నిత్య కళ్యాణం పచ్చ తోరణంలా విలసిల్లుతుంది.

ఈ లోకంలో మనిషిగా జన్మించిన తర్వాత మరణం తప్పదు. మరణించిన మనిషి ఈ లోకంలో బ్రతికి ఉండాలంటే అతను చేసిన మంచి పనులే కారణమవుతాయి. అందుకే సమాజ హిత కార్యక్రమాలు చేసిన వారు సమాజంలో వారు మరణించినా కూడా బ్రతికే ఉంటారు. ఇదే విషయాన్ని

**"జన్మతః వచ్చిన పేరు**
**మరణంతో పోతుంది**
**కర్మతః వచ్చిన పేరు**
**మరణానంతరమూ ఉంటుంది"** అన్న సూక్తి ద్వారా అందించారు.

మరొక స్ఫూర్తిదాయకమైన సూక్తిని చూద్దాం...

**"కష్టపడితేనే తెలుస్తుంది**
**బ్రతుకు విలువ**
**దూరమైతేనే తెలుస్తుంది**
**మనిషి విలువ"**

ఇతరుల మీద ఆధారపడి బ్రతుకుతున్నవారికి బ్రతుకు విలువ తెలియదు. జీవనం కోసం కష్టపడి, భృతి సంపాదిస్తూ జీవిస్తే ఆ జీవితం విలువ తెలుస్తుంది. అలాగే మనిషి దగ్గరగా ఉన్నప్పుడు ఆ మనిషి విలువను మనం గుర్తించము. ఆ మనిషి దూరమయ్యాక తెలు స్తుంది ఆయన విలువ ఏమిటో...

మనిషి మానసిక పరిణతికి, వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే సూక్తులు, హితోక్తులు, సుభాషితాలు ఈ పుస్తకంలో అనేకంగా ఉన్నాయి.

సమాజంలోని వ్యక్తులందరూ సంస్కారవంతులు, సద్గుణ సంపన్నులు కావాలంటే కవులు, రచయితలు ముందుకు రావాలి. ఇలాంటి పుస్తకాలు మరెన్నో ప్రచురించాలి.



- వైరాగ్యం ప్రభాకర్
9014559059

# చమక్కులు-తళుక్కులు పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

హైదరాబాద్, డిసంబర్ 3:ఉత్తమ రచనలు సమాజాన్ని మంచి మార్గంలో నడిపిస్తాయని ప్రముఖ కవి, విద్యావేత్త డా॥వై. రామ కృష్ణారావు అన్నారు. శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో గత గురువారం నవంబర్ 27న రాత్రి త్యాగరాయ గానసభలో ప్రముఖకవి తిరుమల వెంక టస్వామి (టివి స్వామి) రచించిన చమక్కులు-తళుక్కులు పుస్తకావిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొని పుస్త కాన్ని ఆవిష్కరించిన వై. రామ కృష్ణారావు మాట్లాడుతూ టి.వి. స్వామి విశిష్ట వ్యక్తిత్వం కలిగిన సాహితీమూర్తి అని ప్రశంసించారు. స్నేహభావంతో పుస్తకాన్ని ప్రముఖ కవి, కీర్తి పురస్కార గ్రహిత ఉమ్మడిశింగు రాఘవ రావుకు అంకితం ఇచ్చి ప్రతిభను ప్రోత్సహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు రాంబాబు, జనార్ధనమూర్తి, గౌరీశంకర్, లలితవాణి, ప్రభాకర్, సుందర రామకృష్ణ, జయసూర్య, భవాని, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1635వ రోజు 'వెక్కిరింత' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'వెక్కిరింత' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.

-సంపాదకులు



**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**

అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు, 9441046839

## కొక్కిరింత!

నోటితో నవ్వుతూ
నొసటితో వెక్కిరింత
కోతిలా పళ్లికిలిస్తూ
గుర్రంలా సకిలింత
ఆపై ఓండ్రపెట్టే తత్వం
కుళ్లు అసూయ
చుప్పనాతి సంకుచితత్వంతో
మాటల్లో శ్లేష
ఎదురు తిరిగి అడిగితే
"నీది పిచ్చుకబుర్ర" అని
ఎదురుదాడి
దుష్టచతుష్టయాలు
వెక్కిరింతలో ఘనులు
కొక్కిరాయిలా కొందరి మాటలు
పుండులా సలిపి
మనసుని పిండేస్తాయి.
కార్టూన్ జోకుల్లో
చిత్రాలు, డైలాగులతో
పకపకా నవ్వులు
అరటితొక్కపై కాలేసి జర్రున
"వావ్! భలే స్కేటింగ్!
ఒలింపిక్స్ లో
నీకే బంగారు పతకం!"
చుట్టుపక్కల జనం
ఫకాల్న ఫక్కుమంటే
ఒంటికి రాసిన కారం!.
వీరాధివీరులే అంటూ
మాయాశశిరేఖ
లక్ష్మణకుమారుని ఉబ్బేస్తే
"సుందరి నీవంటి
దివ్యస్వరూపం" అంటూ
ఒలంగి సావిత్రిల నటన!.
హేళన ఎత్తిపొడుపు
వ్యంగ్యం మిళాయించి
"నాగుపాము నీజడ
కుప్పెలతో నడుంపై
అటూఇటూ ఊగుతుంటే
నిలువదే నామనసు"
అని పాడితే కొత్తిమీర కట్ట
బాబ్డ్ బేబీకి ఒళ్లు మండదూ!?
కాలి చెప్పుకి పని చెప్పదా!!.
ఎన్నికల లో గల్లంతైన పార్టీలకు
"మీవల్ల మేం గెలిచాం
మీకిదే మా సలాం" అంటే పా
ములు జెర్రులూ పాకుతాయి
కవి పండిత గోష్ఠుల్లో
విశ్వనాథ విసుర్లు
నేటి గరికపాటి చమక్కులు
ఫన్ నే గన్ గా వాడే
చురకలు అంటించే పెద్దలు
మింగలేక కక్కలేక నోరు బంద్
ఇదే నేటి ప్రపంచం!.

-ఎ.రాజ్యశ్రీ

## మేధావులు

వెక్కిరింత-కొక్కిరింత
జంట పదాలు
వ్యంగ్యోక్తులకు పుట్టిళ్ళు.
నోరు మాట్లాడుతూ
నొసటితో వెక్కిరిస్తూ నానుడి
ఇటువంటి వారిని చూసి
పుట్టుకొచ్చింది..
అదేంటో!
ఎదుటివాడిని బాధించాలనే
శాడిజం
వ్యంగ్యోక్తుల ఫాసిజంతో
బేజారెత్తిస్తారు తోటివారిని..
ఉన్నవి లేనట్లు కల్పిస్తారు
వేధిస్తారు వెటకారంతో
మసిబూసి మారేడు కాయగా
మార్చేస్తూ
తానొవ్వక నొప్పిస్తారు
ఎదుటివారిని వెక్కిరింతలతో ..
వెక్కిరించింది చాల్లే!
నిన్ను నీవు తెలుసుకో ముందు
ఎదుటివారిని ఎగతాళి చేసే
యోగ్యత నీకుందో లేదో.
కొందరు..
వెక్కిరింతతో
నవ్విస్తారు
కుళ్ళు జోకుల
కుళాయి విప్పుతారు
మరికొందరు వేధిస్తూ
ఇంతేనయా!
లోకం తీరు
ఉంటారు కొందరు మేధావులు
వెక్కిరించడమే వాళ్ళ పని అన్నట్లు.

-పి.పద్మావతి

## ఎండమావులే

అబ్బో వెక్కిరింతలలో
ఎన్నెన్ని వర్ణాల విసనకర్రలో
వదిన అన్న ఒక్క పదాన్ని
చేంతాడంత సాగదీసి
వెక్కి రిం తల కొక్కిరాయితో
అవసరాల కోసం
ఊరు మీద
ముచ్చట్లతో ఎసరు పెట్టి
ఎత్తి పొడుపు మాటలతో
మంట పెట్టి
మూతి మూడొంకలు తిప్పుకుంటా
ఒకరి మీద ఒకరికి వెక్కిరితలతో
ఎగేసి చెప్పి
వెనుక వెక్కిరించే మాటలతో
పూటలు గడుపుకునే
వాళ్ళు ఎందరో.
కొందరు మాటలతో
మరికొందరు అనుకరణతో
ఎదుటి వ్యక్తి హావభావాలను
అచ్చు గుద్దినట్లు
నడకలతో వెక్కిరిస్తారు
కొందరు మాటలతో వెక్కిరిస్తారు
ఓర్వలేక కొందరు వెక్కిరిస్తే
వినోదం కోసం
కొందరు వెక్కిరిస్తారు.
జంతువులతో
పోల్చి చూపిస్తారు కొందరు
కొందరు ఎగతాళిగా నవ్వుతారు
కొందరు
కొక్కిరించి మాట్లాడుతారు
వెక్కిరింతలు ఎండమావులే
కొందరు జీవితాలకు.

-పొన్నాల ధనమ్మ

## వేళాకోళం మానుకో

నోరు పెగలదు
కొందరికి పొగడ్తలకు!
ముందుంటారు
ఎప్పుడూ వెక్కిరింతకు!
వెక్కిరింత ఓ అనిర్వచనీయ జాడ్యం!
తమ ముఖం చూస్కోరు అద్దంలో!
ఎదుటివారి అందచందాలనో
వారి చిన్న అంగవైకల్యాన్నో
అనుకరించి ఆటపట్టిస్తారు!
నోరు మాట్లాడుతుంటే
నొసలు వెక్కిరించిందట!
సామెత వీరి విషయంలో సత్యం!
ముక్కు మూడువంకర్లు తిరిగిందనో
వాడి దొడ్డికాళ్ళు చూడరా అనో
నోరిప్పితే వాడివి గార పళ్ళే అనో
వాడి కళ్ళు ఎంత ఎరుపో చూడు
అచ్చం తాగినోడివిలా ఉన్నాయనో
అవాకులు చవాకులు వాగే
అయోమయ అవతారాలను చూస్తే
నాకైతే పీకలదాకా వస్తుంది కోపం!
వాడి లోపాలు చూసుకోక
ఇతరులను వెక్కిరించే
వెంగళప్పలను
తరమాలి ఊరు నుండి!
తస్మాత్... జాగ్రత్త!!!.,

-కోలా సత్యనారాయణ

## మర్చిపోకండి

వెక్కిరింతగా మాట్లాడటం
కొంతమంది అలవాటు.
అంటారిలా జరిగింది పొరపాటు
ఏ పనిలోనన్నా
తప్పు పట్టడమే అలవాటు.
ఏ కళ చూసినా
అందులోని ప్రతిభ కనిపించకపోగా
ఎంచుతారు తప్పులను
మాటలలో ఉంటుంది వెక్కిరింత
అనుకుంటారు బాగా మాట్లాడామని.
వాళ్లకే అన్ని తెలుసని
బంధువులు ఇంటికి వచ్చినా
వారి మనసును గాయపరుస్తారు
తమ వెక్కిరింత మాటలతో
తాము ఎవరి ఇంటికి వెళ్లినా,
వారిని అవమాన పరుస్తారు
తమ మాటలతో.
తామంత బాగా
ఎవరూ మాట్లాడలేరనుకుంటారు.
వారిని వెక్కిరించేవారూ
ఉంటారు మరొకరు.
తప్పులెన్ను వారు
తమ తప్పులెరుగరు
అన్నాడు వేమన.
ఎవరైనా
ఏదైనా వస్తువు కొని చూపిస్తే,
ధర అడిగి
మాట్లాడతారు వెక్కిరింతగా.
ధర ఎక్కువైతే
ఎక్కువ డబ్బులు పోసారని
తక్కువైతే
తక్కువ ధర వస్తువులే కొంటారని
అవమానిస్తూ మాటలు
కొంతమంది
ఎవరైనా బహుమతి ఇస్తే
సంతోషంగా స్వీకరించకపోగా,
ఏదో ఒక వంక పెడతారు.
బహుమతి ఇచ్చినప్పుడు
ఇచ్చిన వారి ప్రేమను గుర్తించండి.
కళను చూసినప్పుడు
వారి శ్రమను గుర్తించండి.
వారి ప్రతిభను గుర్తించండి.
ప్రోత్సహించక పోయినా
పరవాలేదు
నిరుత్సాహపరచవద్దు.
వెక్కిరించే ముందు
మిమ్మల్ని వెక్కిరించే వారూ
ఉన్నారని
మర్చిపోకండి.

-డా.షహనాజ్ బతుల్

## వెక్కిరింతల్లో వెరైటీలు

అబ్బో!
పెళ్ళికూతురు ఎంత బావుందో!
కళ్ళుకొంచెం మెల్లేగాని
పద్మనయనాలు.
ఏంటిరా!ఆ చొక్కా.
ఎన్నాళ్లయింది ఉతికి?
అమావాస్య
చంద్రునిలా వెలిగిపోతోంది.
ఆయనకి గుణం ఒకటే తక్కువ
మిగతావన్నీ ఎక్కువే.
హోటల్ భోజనంతో
హెల్త్ మాత్రమే పాడు
కొందరి చేతి భోజనంతో
నోరంతా పాడు.
ఎంత ట్రై చేసినా
వేదాంతం అబ్బ లేదు
అందుకే నిన్ను పెళ్లి చేసుకున్నా.
వెక్కిరింతలలో
వెరైటీలెన్నో
కొన్ని
వెంటనే అర్థమవుతాయి
మరికొన్ని
మసి పూసి మారేడు కాయ
అన్నట్లు ఉంటాయి.
వెటకారాలకు
వెక్కిరింతలకు
తగిన మోతాదులవసరం.
చిలకమర్తి గయోపాఖ్యానంలో
బావమరిది అర్జునుడు
బావ కృష్ణుడిని
ఊపేసిన వెటకారాలు ప్రసిద్ధమే.
మాటైనా పాటైనా
మనసు నొవ్వకుండా
చూసుకోవాలి.
వెక్కిరింతలతో
సంబంధాలకు కత్తెర పడకుండా
జాగ్రత్త పడాలి.
హాయిగా నవ్వుకునే
వెక్కిరింతలైతే ఆరోగ్యకరం.

- డా.సి.వసుంధర

## హేళన

అతి జ్ఞానవంతులకు
మిగిలిన చతురత
ఎదుటి మనసు మంచి
చూడలేక
మాయ మాటలు!.
కఠిన శిలలకే కలత రేపే
కారణం లేని వ్యంగ్యాలు
కారుణ్య మూర్తులు
పలుక లేని
కఠిన భాషతో
కాటు వేయగల ప్రబుద్ధులు
కళ్ళ నుండి జాలు వారే విషం!
పాము కన్నా ఉధృతం
చెప్పలేని రాక్షసత్వం
మనిషి పేరుకు మనుగడ?
కాళరాత్రి లో కటిక చీకటి
కారుణ్యంలేని హృదయాలు.
వీరికి దూరం ఉండడం శ్రేష్ఠం
భాషణ సులభతరం కాదు
కత్తితో వేటు కడు సులభం
తప్పించుకోక తప్పదు
ఇది సత్యం!!!.

-కె.కె.తాయారు

## వెకిలితనం ఫలం

ఆంగ్ల భాషలో
ఈ వెకిలిమాటే
వెక్కిరింత
రఫ్ సెటైర్ వెక్కిరింత
తప్పెరిగి
తన తప్పు దిద్దుకోడానికే
తెలుసా!.
తెలిసినా తెలియకున్నా
తప్పులెన్నువారు
తమ తప్పులెరుగరు
గురివింద
నలుపెరగదన్నట్టే.
తమ బోటి
వెక్కిరింత గాండ్లను
కలిస్తే స్మశానవైరాగ్యం తీరే
అతికొద్దిసేపే
కొంతమంది దాని చేతిలో
బొమ్మ
వీరికి మర్యాద
మన్నన నచ్చక
తమవంటి వారినే
వెతికి మరీ
వెక్కిరింతను పోషిస్తారు
తమను మించిన వెక్కిరింత
చూడడమే మంచి మందు.

-ప్రశాంతి రేవూరి

## చలిపదాలు

కప్పు నిండా
నీరెండ
ఛాయిని మోసుకొచ్చింది.

ఎండైన పాదాలు
నడకలో
తేలాయి.

మంచుతునక
ఆకుమీద నాట్యమాడుతూ
జారిపడింది.

చెట్టు
ఎండ దుప్పటిని
కప్పుకొని
ఆలస్యంగా నిద్రలేచింది.

చలికాలం
రాసే కవితాక్షరాలనూ
వణికిస్తున్నది..!



-డా॥కాసర్ల నరేశ్ రావు
9441406252

## ఆక్సిడెంట్

మద్యం మత్తులో స్పీడ్
కంట్రోల్ లేని డ్రైవింగ్
నిర్లక్ష్యపు కాన్ఫిడెన్స్ తో
వాహనాలు 'ఢీ'కొని
ప్రమాదంలో రక్తపుశవాలు.
రహదారుల వెంబడి
వాహనాలు దారితప్పి
మనుషుల మరణాలు పెరిగి
మనసుల శోకగీతమయింది
క్షణికాలపు స్వప్న సౌధాలు
భద్రతలేని గమ్యంలో
ఊగిగలాసడే తెరల మధ్య
కోటి ఆశల ఊపిర్లు
గాలిలో కలుసున్నాయి



-డా॥పగిడిపల్లి సురేందరు
8074846063

## విషాద కవిత

అమ్మ నాన్న ల
ఆశల బంగారు వజ్రాలు
కన్నీటి బిందువుల్లో కరిగి పోయాయి
ముగ్గురమ్మాయిల జీవితాన
కాలం, మనిషి, నిర్లక్ష్యం
ఒకే చాటున చేరి
మరణానికి మంగళం పాడాయి..
బంగారు బిడ్డల పై
కంకరల అక్షింతలు జారిపడ్డాయి
ఆశల గుడిలో దీవెనలు
బూడిదైపోయాయి
నిండు నూరేళ్ల జీవితమని
కలలు కట్టినవారికి
దేవుడు కూడా ఇప్పుడు
అక్షింతలు లేని
కంకరతోనే దీవించాడు..
(రోడ్డు ప్రమాదం లో
అసువులు బాసిన
ముగ్గురమ్మాయిలు)



-ఎలగొండ రవి
9848770345

## నానీలు

నిన్నటి సుగంధం
యౌవనం
పెనవేసుకుంటున్న
బంధం.

ధమాకా అమ్మకం
తగ్గింపు సగం
ఇంటికెళ్లి చూస్తే
వన్నె తగ్గింది ముఖం.



-డా॥శిరీష
సెల్:98660 50220

## అధర్మానికే తివాచీ

మన పాలనలో లోపాలను ఎత్తిచూపే మన అడవి బిడ్డలనే నిర్దాక్షిణ్యంగ హతమార్చమని ఏ దేవుడు చెప్పాడు మన దేశాన్ని దోచుకునే మాఫియా ముఠాలను ముష్కర మూకలను. అతిథి రాచ మర్యాదలతో పోషించిన సర్కార్‌మన జాతి బిడ్డలని విచారించడానికి న్యాయస్థానాలే కరువైనయా!

లొంగి పోవడానికి వచ్చిన నీ బిడ్డలని కర్కోటకంగ బూటకపు ఎన్కౌంటర్ల పేర పాలించే మీరే కాటేస్తే ఎవరికి మొరపెట్టుకునేది

కోటానుకోట్ల జనం ఉన్న మనదేశంలో లక్షల ఓట్లకే ప్రజాప్రతి నిధులై దేశాన్ని చక్కదిద్దాల్సిన పాలకులు మీరే జీవన హక్కును కాలరాచి రాజ్యాంగాన్ని అతిక్రమిస్తేఎట్ల?

అధికారం చేపట్టిన ఒక్కరిద్దరి హుకుం వెలగట్టలేని సంపదను తాకట్టు పెడుతుంటే ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన వారే స్వార్థం ముసుగులో అహం అడ్డొచ్చి ప్రశ్నించుటే నేరమై తప్పిదమన్నట్టునిజం గ్రహించని అధికార బలం

తొలుత నాలుగు కాళ్ళ మీద నడిచిన ధర్మం నాలుగో యుగానికి ఒంటి కాలు మీద కుంటి నడక కాలం.

పాలించాల్సిన రాజ్యం అధర్మాన్ని బలంగ చేసుకొని మృగాలను హతమార్చడానికి తామే క్రూర మృగాలై పచ్చని అడవి పుడమిని పొరలు పొరలుగ పెగిలించి ప్రపంచ ధనిక జాబితాలో చేరాలనే పైశాచికానందం ప్రకృతిని చరబట్టి అడవి బిడ్డల బతుకుల్లో సజీవ చితి పెడుతూనే ఉంది!

చంపించడం చంపడం అది అనాగరికం ఏ నాగరిక ప్రపంచమైన సమర్థించదు ప్రగతిని కోరుకునే మనిషి చూపు విధ్వంసం వినాశనం కోరుకోదు.

మారణ హోమం చేసే వారికన్న పురమాయించే వారే నేరస్తులు క్రూర మృగం కూడ తన జాతిని తనే బక్షించదు పాముకు తల నుండు విషము తేలుకు తోకనుండు విషయము మనిషికి నిలువెల్ల విషమే నన్నట్టు దిక్కార గొంతుల శబ్దాన్ని కూడా వినటానికి ఇష్టపడట్లే నీతి న్యాయానికి కాలం చెల్లి అవినీతి మూకలతో కలియ తిరుగుతోంది స్వార్థం ఏ వైపునున్న

అత్యాశ జనారణ్యం దాటవేసి దండకారణ్యాల వైపు చూపు మలుచుకుంది దేవుడనే వాడు అధర్మానికే తివాచి పరుస్తుండెమో? ఇది కలికాలం ఎవరి తప్పులు వారు తెలుసుకునేదెప్పుడో.

-యరకల యాదయ్య, 9866468979



**తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం - కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..**

నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

## పొరపాట్లు

పొరపాట్లు
అదమరిస్తే అగచాట్లు
తప్పించుకోలేని ఇక్కట్లు
అనుకోని గ్రహ పాట్లు !.
ఒక పొరపాటు
మరో పొరపాటుకు సరిహద్దు
కావాలి దానికి దిద్దుబాటు
దిద్దుబాటే ప్రమాదాలను సరిదిద్దు!.
కారణం ఏదైనా
కుడి ఎడమల పొరపాట్లు
తీర్చలేరు గంధర్వులైనా
తీరని దుఃఖ పాట్లు !.
శిశుపాలుని వంద పొరపాట్లు
తెలిసి శిరమొక్కనిదే తెగే
తెలియక ఒక్కని పొరపాట్లు
చేస్తుంది వందల ప్రాణాలు తెగేటట్లు!.

-పట్లోళ్ళ బక్కారెడ్డి
9705315250

## సూర్య "వేదన"

మహా నగరంలోని
గతుకుల గతుకుల రోడ్డు మీది
నీటి మడుగులో పడ్డ
సూర్యుడు
లారీ చక్రాల కింద
నలిగి చెదురు మదురై
గిల గిలా
కొట్టుకుంటున్నాడు!
పాపం ! సూర్యుడిని
హాస్పిటల్లో
చేర్చే నాధుడే లేడు ---
సూర్యుడు అనాధుడు ??

-కందాళై రాఘవాచార్య
8790593638

## స్విచ్ఛాఫ్ అయిన ఊపిరి

ఆసిఫాబాద్ లో 'హాలో 'అని పలికిన ఎస్‌టిడిబూత్ నీది
మా మంచీచెడుల సంభాషణలకు వారధి నువ్వు
సాంకేతిక విప్లవానికి సారధి నువ్వే
మా దూరాలను దగ్గర చేసి నువ్వు దూరమయ్యావా తమ్ముడు
బిలియనీర్లు శాసిస్తున్న గ్లోబల్ మార్కెట్ సునామీలో
వేలుతుఫాన్ లాంటి ఆన్ లైన్ అంగట్లో
అడ్రస్ గల్లంతు కాకుండా
అపారానుభవంతో వ్యాపారసముద్రంలో
సాగుతున్నపడవ హైలెస్సా పాట గాల్లో కలిసిపోయింది
నువ్వు స్థిరపడ్డావనుకుని
నాలో నేను అమితంగా పొందిన ఆనందం డాటా
అంతలోనే కరిగిపోయింది
మారంచేసిన సెల్లుల స్విచ్చాన్ నువ్వే
మా సెల్ రీచార్జింగ్ పాయింట్ వి నువ్వే
బడిలో ఎన్ని పాఠాలు నేను బోధించినా
ఫోనుఫీచర్లు చెప్పడానికి నా ముందు టీచరయ్యేవాడివి
మా సవాలక్ష ప్రశ్నలకు సమాధానమయ్యి
నవ్వుతూ స్మార్ట్ ఫోన్లను మాకు అప్పగించిన
పరుసవేది విద్య నీది
నోకియా ,శామ్ సంగ్ ల 2జి కాలం నుండి
వీవో,ఒప్పో,ఒన్ ప్లస్ 5జి కాలందాకా
ఫోను స్వరాల అవసరాల
పునరపి రాకపోకలు మావి
సెల్లు కు ఏ జబ్బుచేసినా
నేనున్నాననే డాక్టరువు, ధైర్యానివి
నువ్వేకదా తమ్ముడూ
జీవితాశయంకోసం శ్రమిస్తున్న నీవు
గడువు ముగియక ముందే గతించావా తమ్ముడూ
అంతా చీకటే అలిమినఆసిఫాబాద్ లో
నీ కోసం నేను ఎక్కడని వెతకను
నువ్వుండే నీ షాపు ముందు
నా ప్రయాణం ఇంతటితో ముగిసిందంటూ
నీ ముకుళిత హస్తాలఫోటో ఫ్లెక్సీని చూసి
ఆసిఫాబాద్ లో నీ కోసం నేను ఎక్కడని వెతకను.
కష్టనష్టాల అభిఘాతాలెన్నో చెప్పని జీవితంలో
విధి రాసిన ఒంటరితనపుదుఃఖ గీతంలో
కలిసిరాని కాలానికి పల్లవీ చరణమయ్యి
కలలు కంటూనే సెలవని వెళ్లావా తమ్ముడూ
ఖడ్గనీతి నిర్దయగా ఖండించటమనుకుంటా
కాలరీతి నిలువునా మండించడమనుకుంటా
నువు లేవన్న నిజం తెలిసి జీర్ణం కాలేదు నాకు
గుండెలో బాధరగిలిన అగ్గిలో కాలే కట్టెలా ఒరిగి అలా
ఉన్నచోటే కుమిలి కన్నీరయ్యాను తమ్ముడూ
నిన్ను గురించి విని మనసులో వేదన సుడిరేగింది
గుండె బరువెక్కి కన్నీరుమున్నీరయ్యింది
నిన్ను చూడాలని ఆశ ఆకాశమంత ఎదిగితే ఏంలాభం
నీ జీవితం అర్థాంతరమయిన
ఆర్ధ్రతాకాశపు ఆసిఫాబాద్ లో
నీ కోసం నేను ఎక్కడని వెతుకను
ఆపిల్ లాంటి గుండ్రని ఎర్రని నీముఖం
గిగాపిక్సెల్ మూడు కెమెరాల
ఫ్లాష్ లాంటి కళ్ల మెరుపుదనం
మాటల మధ్య మెలోడి రింగ్ టోన్ లా
దొర్లే నీదైన మందహాసం
అన్నా అంటూ ఆత్మీయత పంచిన
మూగవోయిన నీమృదువైన కంఠంకోసం
సూదంటురాయిలాంటి నీ సుందర రూపం కోసం
ఆసిఫాబాద్ లో నేను ఎక్కడని వెతకను
నీ ఊపిరి స్విచ్ఛాఫ్ అయిన ఆసిఫాబాద్ లో
కరుణ లేని కాలం ముంగిట
నువ్వు లేని చీకటి లోకంలో జూమ్ చేసి
నీ కోసంనేను ఇప్పుడు ఎక్కడని వెతకను.
( అకాలమరణం పొందిన తమ్ముడు
పాపిని విక్రమ్ కు నా అక్షరాంజలి)

-రమేశ్ నల్లగొండ
8309452179

## అనాధ "సూర్యుడు!!

మహా నగరంలోని
గతుకుల గతుకుల రోడ్డు మీది
నీటి మడుగులోని
సూర్యుడు
లారీ చక్రాల కింద
నలిగి చెదురు మదురై
గిల గిలా
కొట్టుకుంటున్నాడు!
పాపం ! సూర్యుడిని
హాస్పిటల్లో
చేర్చే నాధుడే లేడు
సూర్యుడు అనాధుడు ??

-కందాళై రాఘవాచార్య
8790593638

## అభినందనం వందనం

అక్షరం దిద్దకుంటేనేం
అందెశ్రీ నీవే..
అక్షర ప్రవాహమై కదలినావు
కోట్లాది గుండెల్లో కొలువైనావు
మాయమైపోతున్న మనిషిని యాజ్జెసి
వెన్నుతట్టి
మేలుకొల్పు పాటైనావు
తెలంగాణ ఉద్యమంలో
నిప్పులు పుక్కిటపట్టి
పాటల అగ్గిరవ్వల రాజ్జేసి
ఆవేశపు సెగలు పుట్టించినావు.
బాధల సుడిగుండమై తల్లడమైనావు.
తెలంగాణ గీతమై పల్లవించిన
ప్రజాకవి
గుండె లోతుల్లోంచి
ఉరికొచ్చే నీ ప్రతిపదం
ప్రజా చైతన్యప్రవాహం
సహజ స్వరఝురులు
భావచిత్ర పదలహరులు.
జనంమెచ్చిన ధన్యజీవి
నీ జీవితమే సందేశకావ్యం
విధిరాతకు తలవంచివెళ్ళినా..
నీ యాత్ర
చరిత్ర సృష్టించిన జనజాతర
ఓ కళావేదిక.
తెలంగాణ పొద్దైపొడిసి
ప్రకృతి పాటైవిరిసి
మనసు తేటగా
ఓ కవి ఈ పొద్దు
ఏలోకాన గీతాలు పాడ
పయనమైతివో...
జయ జయహే
తెలంగాణ కవిగాయక
నీ కలగళానికి
అభినందన చందనాలు
తడిగుండెల వందనాలు

-గడ్డం సులోచన
7702891559.

## "పినాకినీ తీరంలో కవితా ఘలం ఘలలు" ఆవిష్కరణ



పుస్తకావిష్కరణలో అతిథులు

హైదరాబాద్, డిసంబర్ 3:డా॥ సోమసుందర్ ఆవంత్స రచన 'పినాకిని తీరంలో కవితా ఘలం ఘలలు..' ను ప్రముఖ రచయిత విమర్శకులు ఎంవీ రామిరెడ్డి ఆవిష్కరించారు. ఈతకోట సుబ్బారావు కవితా సమాలోచనగా వారి కవితా సంపుటాలపై సోమసుందర్ ఈ కావ్యం ను రచించారు.ఆదివారం మినర్వా గ్రాండ్ సమావేశ మందిరంలో ఈ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు . ఆవిష్కరించిన ఎంవీ రామిరెడ్డి మాట్లాడుతూ... తెలుగు సాహిత్యం లో సోమ సుందర్ గారు ఒక లెజెండ్ అని వారి ప్రశంస పొందటం అభినందనీయమని అన్నారు .సాహిత్య చరిత్రకు ఇలాంటి ప్రముఖుల రచనలు, వ్యాసాలు అవసరం అన్నారు. వ్యాసం రికార్డ్ కావటం అభినందనియమనిఅది వర్తమానానికి రేపటి తరానికి కూడా దిక్సూచిగా నిలుస్తుందని అన్నారు. ఈతకోట సుబ్బారావు కవిత్వం పై సోమ సుందర్ ఇష్టపూర్వకంగా సుదీర్ఘమైన వ్యాసం రాయటం నిజానికి ఇది గొప్ప అదృష్టం మాత్రమే కాదని రేపటి తరానికి ఇదొక చరిత్రగా నిలుస్తుందని అన్నారు .సుబ్బారావు కవిత్వం మీద ఇప్పటికే పలు వ్యాసాలు సమీక్షలు కథనాలు వచ్చినప్పటికీ ప్రముఖ పండితులు అయిన సోమ సుందర్ సుదీర్ఘమైన వ్యాసం, అదీ నాలుగు కవితా సంపుటాల పై రావడం ఒక రికార్డు అయితే కాలగమనానికి కూడా రికార్డుగా నమోదు కావటమేనని అన్నారు. రామిరెడ్డి గారు ఆవిష్కరించి, తొలి ప్రతిని మరో ప్రముఖ కవి సుంకర గోపాల్ కు అందజేశారు .ఈ కార్యక్రమంలో విశాలాక్షి సంపాద కులు కోసూరు రత్నం ప్రముఖ రచయిత్రి ఎస్వీ నాగ గాయత్రి ,ప్రాచీన విశిష్ట అధ్యయన కేంద్రం రీసర్చ్ స్కాలర్ రామకృష్ణ, రచయి తలు ఈతకోట సుబ్బారావు దంపూ రు రామకృష్ణ లు పాల్గొన్నారు.


ఆహ్వానం

తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ
సౌజన్యంతో
ఎవర్‌గ్రీన్ యూత్ అసోసియేషన్
శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్
సంయుక్త ఆధ్వర్యంలో



ప్రముఖ రచయిత శ్రీ నేతాజీ రచించిన
"శ్రీహరి చందనం"
కవితా సంపుటి ఆవిష్కరణ మహోత్సవం



తేది : 04-12-2025 గురువారం ఉ॥ 10-00 గం॥లకు
వేదిక : రవీంద్ర భారతి సమావేశ మందిరం (మొదటి అంతస్తు), హైదరాబాదు.

ముఖ్య అతిథి, ఆవిష్కర్త : డా॥ కె.వి.రమణాచారి, ఐ.ఏ.ఎస్. (విశ్రాంత)
పూర్వ సలహాదారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
సభాధ్యక్షులు : శ్రీ బైస దేవదాసు, "నేటి నిజం" పత్రికా సంపాదకులు
విశిష్ట అతిథి : డా॥ ఏనుగు నరసింహారెడ్డి
సంచాలకులు, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ
గౌరవ అతిథి : డా॥ మసన చెన్నప్ప తెలుగుశాఖ, పూర్వాధ్యక్షులు, ఉస్మానియా యూనివర్శిటీ
ఆత్మీయ అతిథులు : శ్రీ బ్నిం, కవి, రచయిత, కార్టూనిస్టు, చిత్రకారుడు,
నాల్గు నంది అవార్డుల గ్రహీత, సెన్సార్ బోర్డు సభ్యులు
శ్రీ రెబ్బా రామారావు, ప్రధాన కార్యదర్శి, హెచ్.ఎం.ఎస్. యూనియన్
శ్రీ దైవజ్ఞ శర్మ, సరస్వతి ఉపాసకులు
డా॥ ఇ. యాదగిరి, ప్రముఖ కవి

అందరూ ఆహ్వానితులే

నేతాజీ
ప్రధాన కార్యదర్శి,
ఎవర్‌గ్రీన్ యూత్ అసోసియేషన్

రఘుశ్రీ
ప్రధాన కార్యదర్శి,
మానస ఆర్ట్ థియేటర్స్

# తెలుగు నవలా సాహిత్య వైతాళికుడు ఉన్నవ

గాంధేయ వాదిగా, న్యాయవాదిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య యోధుడుగా, ఉద్యమ నాయకునిగా, స్త్రీ విద్య ప్రోత్సాహి కునిగా, కాంగ్రెస్ నేతగా, దళిత జనోద్ధారకు నిగా, ప్రధానంగా తెలుగు నవలా సాహిత్య వైతాళికుడుగా ఉన్నవ లక్ష్మీనారాయణ తెలుగు వారికి సుపరిచితుడే. ముఖ్యంగా నాటి సాంఘిక దురాచారాలను ప్రతిబిం బిం చే, మాలపల్లి నవల నాడు ఒక సంచల నమే.



**సాంఘిక, ఆర్థిక అసమానతలను తొలగించి, కులవ్యవస్థను నిరసించి, అందరూ సమానులే అన్న భావనతో, అగ్రవర్ణాలు, హరిజనులు అందరూ కలసి మెలసి ఉండాలని**




**కోరుకుంటూ, మాలపల్లి అనే విప్లవాత్మకమైన నవలను రచించడం, తన దృక్పథానికి మద్దతుగా, సహపంక్తి భోజనాలు నిర్వహించడం ఆ రోజులలో సాహసమే.** మాలపల్లి తెలుగు సాహితీ చరిత్రలోనూ, సామాజిక దృక్పథం లోనూ ఒక నూతన ఒరవడిని సృష్టికి, చర్చోప చర్చలకు కారణభూతమైంది.

ఉన్నవ లక్ష్మీనారాయణ గుంటూరు జిల్లా అప్పటి సత్తెనపల్లి తాలూకా వేములూరుపాడు గ్రామంలో 1877 డిసెంబరు 4వ తేదీన శ్రీరాములు, శేషమ్మ దంపతులకు జన్మించి, ప్రాథమిక విద్య స్వగ్రామం లోనే సాగించాడు. 1897లో గుంటూరులో మెట్రిక్యులేషన్ చదివాడు. 1906లో రాజమండ్రి ఉపాధ్యాయ శిక్షణా కళాశాల లో శిక్షణ పొందాడు. 1916లో ఐర్లాండ్, డబ్లిన్ లలో బారిష్టర్ చదువు సాధించాడు.

గాంధేయ వాదిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య యోధుడుగా, తెలుగు నవలా సాహిత్య వైతాళికుడుగా విశేషమైన కీర్తి పొంది, సాహిత్యం ద్వారా హరిజనోద్ధరణకు కృషి చేశాడు. గుంటూరులో శ్రీ శారదా నికేతన్ ను స్థాపించి, స్త్రీ విద్యను ప్రోత్స హించాడు. కందుకూరి వీరేశలింగం పంతులు అధ్యక్షతలో తొలి వితంతు వివాహం జరిపించిన సంస్కర్తగా నిలిచాడు.

1900 లో గుంటూరులో "యంగ్‌మెన్స్ లిటరరీ అసోసియేషన్"ను స్థాపించాడు. 1902లో అక్కడే వితంతు శరణాలయాన్ని స్థాపించాడు. వీరేశలింగం స్థాపించిన వితంతు శరణాలయాన్ని 1906 లోను, పూనాలోని కార్వే మహిళా విద్యాలయాన్ని, 1912 లోను సందర్శించి అనుభవాలను లక్ష్యానికి జోడించారు. 1913 లో జొన్నవిత్తుల గురునాథంతో కలసి విశాలాంధ్ర పటం తయారు చేశాడు.

లక్ష్మీనారాయణ 1900లో గుంటూరులో ఉపాధ్యాయ వృత్తి, 1903లో అక్కడే న్యాయవాద వృత్తిని, 1908లో ర్యాలీ కంపెనీలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించాడు. రష్యాలో 1917లో జరిగిన బోల్షివిక్ విప్లవం వల్ల స్ఫూర్తి పొందిన మొదటి తెలుగు కవి ఉన్నవ. కూలీల పక్షం వహించి కవులు రచనలు చేయడానికి ప్రేరణ నిచ్చింది సదరు రష్యా విప్లవ ప్రభావమే. 1917 లో మద్రాసు హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశాడు. 1922లో గుంటూరులో శారదానికేతన్‌ను స్థాపించి బాలికలకు విద్య నేర్చుకునే అవకాశం కల్పించాడు. 1922 లో మాలపల్లి నవలను బెల్లంకొండ రాఘవరావు ముద్రించగా, మద్రాసు ప్రభుత్వం మాలపల్లి నవలపై నిషేధం విధించింది. రాజకీయ వాతావరణాన్ని, గాంధీ మహాత్ముని ఆశయాల్ని, తెలుగువారి జీవన విధానాన్ని ప్రతిబింబించిన నవల మాలపల్లి. ఆ నవలలో సాంఘిక దురాచారాలు, జాతీయ సత్యాగ్రహ ఉద్యమాలు, వర్ణ, వర్గ వ్యత్యాసాలు తదితర ఆ నాటి పరిస్థితులను కల గలిపి, కళ్ళకు కట్టినట్లు ఉన్నవ చిత్రించడం విశేషం. ఆనాడు హరిజనుల కుటుంబ గాథను ఇతివృత్తంగా ఎన్నుకొని నవల వ్రాయడమే సాహసం. 1926 లో మద్రాసు శాసన మండలిలో మాలపల్లి నిషేధంపై చర్చలు జరగడం, 1928 లో కొన్ని మార్పులతో మాలపల్లి ప్రచురణకు తిరిగి అనుమతి లభించడం, మద్రాసు ప్రభుత్వం ఆంధ్ర విశ్వ విద్యాలయం మాలపల్లిని ప్రచురించి, ఆ నవలను పాఠ్య గ్రంథంగా ఎంపిక చేయడం, 1936 లో మద్రాసు ప్రభుత్వం మాలపల్లి నవలపై రెండోసారి నిషేధం తెలిపి ఆ నవలను పాఠ్యగ్రంథంగా తొలగించడం, 1937లో చక్రవర్తుల రాజగోపాలా చారి మద్రాసు ప్రధానిగా ఎన్నికైనప్పుడు తొలి కాంగ్రెసు మంత్రి వర్గంచే మాల పల్లి నవలపై నిషేధపు ఉత్తర్వులను రద్దు చేయించడం క్రమానుగతంగా జరిగి పోయాయి. సామాన్య ప్రజల సంక్షేమం, అభ్యుదయాన్ని కోరే కవిత్వం ప్రజలకు సులభంగా అర్థమయ్యే వాడుక భాషలో ఉండాలన్న లక్ష్యంతో మాలపల్లి నవలలో చరమగీతం, సమతా ధర్మం అనే రెండు గేయ కవితల్ని సామాన్య ప్రజలకు అర్థమయ్యే నిత్య వాడుక భాషలో జానపద గేయ రీతుల్లో రచించాడు. ఆ నవలకు కాశీనాథుని



నాగేశ్వరరావు పీఠిక వ్రాస్తూ, "ఆంధ్ర సాహిత్య హృదయ పరిణామాన్ని గ్రహించడానికి మాలపల్లి ఉత్తమ కావ్యం అని, తెనుగు మాటలు, తెనుగు దేశము, తెనుగు హృదయము, తెనుగు సంకల్పము, మాలపల్లి నవలకు అనిర్వచనీయ ప్రతిభను సమకూర్చాయి" అని కొనియాడాడు. అందుకే తెలుగు సాహిత్యంలో వచ్చిన తొలి విప్లవ నవలగా గుర్తింపు పొందింది. మాలపల్లి, నాయకురాలు, బుడబుక్కల జోస్యం, స్వరాజ్య సోది, భావ తరంగాలు తదితర రచనలు చేశాడు.

ఇక 1923 లో కాంగ్రెసు స్వరాజ్య పార్టీలో చేరాడు. ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కమిటీ కార్యదర్శిగా ఎన్నికై, పల్నాడు సత్యాగ్రహ ఉద్యమానికి నాయకత్వం వహించాడు. 1931లో ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో చేరినందుకు, 1942 లో క్విట్ ఇండియా ఉద్యమంలో చేరినందుకు జైలు శిక్ష అనుభవించాడు. గాంధేయ వాదిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య యోధుని గా తెలుగు నవలా సాహిత్య వైతాళికుడుగా కీర్తి పొందిన ఉన్నవ 1958 సెప్టెంబరు 25 న మరణించాడు.

(డిసెంబర్ 4న ఉన్నవ లక్ష్మీనారాయణ జయంతి)



-రామ కిష్టయ్య సంగన భట్ల.
9440595494

## వివక్షత

ఒకరికి ఒక తీరు
మరొకరికి మరో తీరు
ఎంత వివక్షత
ఏకపక్షంగా పక్షపాతం
అంతా పలాయనవాదం
నిలదీసి ఎలిగెత్తే సత్తా
నేడు లాపత్తా
తాయిలాలకు లొంగితే
ప్రశ్నించే గళం మౌనం



-పత్తి శివప్రసాద్
9440001224

# అభేద్యం భారత నావికాదళం

భారతీయ త్రివిధ దళాలైన ఆర్మీ, ఏయిర్ ఫోర్స్, నావికా దళం ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైనవిగా రుజువు చేసుకున్నాయి. 1612లో నాటి ఈస్ట్ ఇండియా కంపెనీ తన అవసరాల నిమిత్తం ఏర్పాటు చేసిన చిన్న నావికా దళం, స్వాతంత్ర్యానంతరం తనను తాను దేశ అవసరాలకు అనుగుణంగా మార్చుకుంటూ, ఆవిష్కరణల ఆసరాతో స్వదేశీ పరిజ్ఞాన గొడుగు కింది అతి బలశాలిగా అవతరించడం మనందరికీ గర్వకారణం. అంకితభావం, సమరోత్సాహం, శౌర్య పరాక్రమాలు, క్రమశిక్షణ లాంటి కవచాలను ధరించి దేశానికి విజయాలను తేవడంతో పాటు సముద్ర తీరాల గస్తీ, దేశ భద్రత, అంతర్జాతీయ సంబంధాల్లో ఊతం ఇవ్వడం, దేశ ఆర్థికాభివృద్ధిలో తోడ్పడడం, ప్రపంచ శాంతి స్థాపనకు పీస్ కీపింగ్ ఫోర్స్‌గా పని చేయడం, విపత్తు నిర్వహణ, సముద్రయానంలో ఇన్నొవేషన్, గస్తీలో శాస్త్ర సాంకేతిక అభివృద్ధితో పాటు వినియోగం లాంటి పలు మహత్తర సేవలను అనునిత్యం అందిస్తున్నది.

### 1971 ఇండో-పాక్ యుద్ధంలో "ఆపరేషన్ ట్రిడెంట్":

1971 ఇండో-పాక్ యుద్ధ సమయంలో 03 డిసెంబర్ రోజున పాకిస్థానీ సేనలు భారత ఏయిర్ బేస్‌లపై ఆకస్మికంగా ముప్పేట దాడి చేయడం, దానికి ప్రతిస్పందనగా 4, 5 డిసెంబర్ 1971 రోజుల్లో భారత నావికాదళాలు "ఆపరేషన్ ట్రిడెంట్" పేరున కరాచీలోని పాకిస్థానీ నావికాదళ కేంద్రంపై దాడి చేయడంతో వేల కొద్ది పాకిస్థానీ సైనికులు మరణించడం, భారత్‌కు తిరుగులేని విజయాన్ని ఇవ్వడం మన గత ఘన చరిత్ర. ఇండియన్ నావీ నేతృత్వంలో "ఆపరేషన్ ట్రిడెంట్" అర్జించి పెట్టిన ఘన విజయానికి గుర్తుగా ప్రతి ఏట 04 డిసెంబర్ రోజు "భారతీయ నావికాదళ దినోత్సం" ఘనంగా నిర్వహించుట ఆనవాయితీగా మారింది. దేశ భద్రత, విపత్తు సమయాల్లో అమూల్య సేవలు, సముద్ర తీర ప్రాంతాల పకడ్బందీ గస్తీ లాంటి పలు అమూల్య సేవలు అందించడంతో పాటు యుద్ధ సమయాల్లో లేదా దేశ రక్షణ విధులు నిర్వహిస్తున్న మన నావికా దళ అమరవీరులకు ఘన నివాళులు అర్పించడం, వారి సేవలను స్మరించుకోవడం, నావికా దళ వీరులకు కృతజ్ఞతలు తెలియజేయడం దేశ భక్తి పరులుగా మనందరి కనీస భాద్యత.

### భారత నావికా దళ దినోత్సవం-2025 ఇతివృత్తం:

04 డిసెంబర్ 2025న నిర్వహించుకుంటున్న భారతీయ నావికా దళ దినోత్సవ ఇతివృత్తంగా "సంఘటిత పోరాటానికి సదా సిద్ధంగా నావికాదళం (కంబాట్ రెడీ ; కొహెసివ్, నావీ)" అనే అంశాన్ని తీసుకొని ఆ దిశగా పటిష్ట అడుగులు వేస్తున్నది. స్వదేశీ టెక్నాలజీ వినియోగంతో బలపడడం, వినూత్న శాస్త్ర సాంకేతిక ప్రగతి వినియోగంతో నావీ సేవలు బలీయం కావడం కొనసాగుతూనే ఉన్నది. 04 డిసెంబర్ వేడుకలు న్యూఢిల్లీ గేట్‌వే ఆఫ్ ఇండియా కూడలిలో సాంస్కృతి కార్యక్రమాలు, అమర వీరులకు శ్రద్ధాంజలి ఘటించడం, విశిష్ట సేవలకు తగు గుర్తింపులు/పతకాలు ఇవ్వడం ఘనంగా జరుగుతుంది.

### భారతీయ నావికా దళం:

1612లో ఒక చిన్న దళంగా ప్రారంభమైన భారత నావికా దళం నేడు 67,252 మంది చురుకైన దళం, 75,000 రిజర్వ్ దళాలతో అభేద్యంగా, మహాశక్తివంతమైన సముద్రయాన/తీర గస్తీ దళంగా ఆవిర్భవించింది. "శామ్ నొ వరునా (పవిత్ర జలదేవత దీవెనలతో)" అనే నినాదంతో దేశ భద్రతే పరమ లక్ష్యంగా 150 నావలు/జలాంతర్గాములు, 300 ఏయిర్‌క్రాఫ్టుల బలంతో అభేద్యంగా మారడం హర్షదాయకం.

భరతమాత సేవలో పునీతం అవుతున్న భారత త్రివిధ దళాలు, నేడు ముఖ్యంగా నావికాదళ శౌర్య పరాక్రమ సాహస వీరులకు, అమరవీరుల కుటుంబాలకు వినయంగా కృతజ్ఞతలు తెలియజేద్దాం. నేల, జలం, ఆకాశమే హద్దుగా మన త్రివిధ దళాలకు సలాం చేద్దాం.

(డిసెంబర్ 4న "భారతీయ నావికాదళ దినోత్సవం" సందర్భంగా)



-డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037




ఆదివారం నెల్లూరు పట్టణంలో జరిగిన డా॥ పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డి నవల అవార్డు, జమునా స్మారక నానీల సంపుటి అవార్డు మహోత్సవంలో అవ్వారు శ్రీధర్‌బాబు 'నానీల వాన' పుస్తకావిష్కరణలో అన్నం శివకృష్ణ, శ్రీమతి తోట సులోచన, డా॥సుంకర గోపాల్, ఎమ్వీ రామిరెడ్డి, కొండ్రెడ్డి వెంకటేశ్వర రెడ్డి, బైస దేవదాసు, గంగిశెట్టి శివకుమార్, సోమిరెడ్డి, ఆవిష్కర్త డా॥ పెళ్ళకూరు జయప్రద, అవ్వారు శ్రీధర్‌బాబు, కె.వి.మేఘనాధ్ రెడ్డి, కాంచనపల్లి రవికాంత్, ఇంద్రగంటి మధుసూదన్, శ్రీమతి గోవిందరాజు, సుభద్రాదేవి తదితరులు.

## కడ్తాల్‌లో ప్రమాదం.. మంటల్లో పూర్తిగా దగ్ధమైన కారు

### కారులో ప్రయాణిస్తున్న నలుగురు సురక్షితం

కడ్తాల్ డిసెంబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: రంగారెడ్డి జిల్లాలోని కడ్తాల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారులో ఇవాళ ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మక్తమాదారం గేటు వద్దకు రాగానే ఆ ప్రమాదం జరిగింది. సడెన్‌గా మంటలు వ్యాపించడంతో ఆ కారులో ప్రయాణిస్తున్న నలుగురు సురక్షితంగా బయటపడ్డారు. ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. మంటల్లో కారు పూర్తిగా దగ్ధమైంది. తలకొండపల్లి మండలంలోని వెంటాపూర్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న సమయంలో కారు అగ్నిప్రమాదానికి గురైంది. అయితే దాంట్లో ఉన్న ప్రయాణికులు అప్రమత్తం కావడంతో.. పెను ప్రమాదం తప్పింది. షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఆ కారులో యువకులు ప్రయాణిస్తున్నట్లు గుర్తించారు. ఈ ప్రమాదం పట్ల ఎవరూ ఫిర్యాదు చేయలేదని స్థానిక పోలీసులు వెల్లడించారు.

## "గతి తప్పిన రుతువు' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో అతిథులు.

సోమవారం భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్, అభ్యుదయ రూరల్ డెవలప్‌మెంట్ సంయుక్తాధ్వర్యంలో సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో "గతి తప్పిన రుతువు' పుస్తకావిష్కరణలో డా॥ ఆలూరి సుభాష్, గోరటి వెంకటన్న, జస్టిస్ చంద్రకుమార్, బి.యస్.రాములు, బిక్కి కృష్ణ తదితరులు.

## స్త్రీ విద్యను ప్రోత్సహించిన మహనీయుడు లక్ష్మీనారాయణ




సమావేశంలో ప్రసంగిస్తున్న డా॥నాళేశ్వరం శంకరం

హైదరాబాద్, డిసంబర్ 3:ఉన్నవ లక్ష్మీనారాయణ తెలుగు నవలా సాహిత్య వైతాళికుడిగా, విశేష కీర్తినార్జించారని సాహితీవేత్త డా॥ నాళేశ్వరం శంకరం అన్నారు. సోమవారం రాత్రి త్యాగరాయ గానసభ అధ్వర్యంలో గాంధేయవాది లక్ష్మీనారాయణ యాదిలో శీర్షికతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. హరిజనోద్ధరణకు కృషి చేసిన మహనీయుడన్నారు. శారదా నికేతన్‌ను స్థాపించి స్త్రీ విద్యను ప్రోత్సహించారన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు లంకా లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, పేరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కాలువలో మునిగిన ఆర్మీ ట్యాంక్.. సైనికుడు మృతి

జైపూర్, డిసంబర్ 3: సైనిక విన్యాసాల్లో భాగంగా ఆర్మీ ట్యాంకు కాలువలో చిక్కుకుని మునిగిపోయింది. అందులో ఉన్న ఇద్దరు సైనికుల్లో ఒకరు ప్రాణాలతో బయటపడగా మరో సైనికుడు మరణించాడు. విపత్తు ప్రతిస్పందన దళం సహాయంతో సైనికుడి మృతదేహాన్ని పోలీసులు బయటకు తీశారు. రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మంగళవారం ఉదయం సాధారణ సైనిక విన్యాసాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఇందిరా గాంధీ కాలువను దాటేందుకు ఆర్మీ ట్యాంకు ప్రయత్నించింది.

కాగా, ఆ కాలువ మధ్యలో ఆర్మీ ట్యాంకు చిక్కుకున్నది. అక్కడ అది మునిగిపోయింది. అందులో ఇద్దరు సైనికులు ఉన్నారు.

ఒకరు బయటకు రాగా మరొకరు ట్యాంకు లోపల చిక్కుకున్నాడు. ఈ సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం, పౌర రక్షణ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. సహాయక చర్యలు చేపట్టాయి. మరోవైపు కాలువలో మునిగిన ఆర్మీ ట్యాంకులో చిక్కుకున్న సైనికుడ్ని కాపాడేందుకు రెస్క్యూ బృందాలు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. పలు గంటల రెస్క్యూ ఆపరేషన్ తర్వాత ఆ సైనికుడి మృతదేహాన్ని బయటకు తెచ్చారు. పోస్ట్‌మార్టం కోసం ఆ జవాన్ మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## బండారి రాజ్ కుమార్ "తెలంగాణ కవి ముద్ర"కు ఆచార్య వాసిరెడ్డి భాస్కర రావు స్మారక సాహితీ పురస్కారం 2025 ప్రదానం

హైదరాబాద్, డిసంబర్ 3:వరంగల్ ఉమ్మడి జిల్లా అభ్యుదయ రచయితల సంఘం 2025 సంవత్సరానికి ఆచార్య వాసిరెడ్డి భాస్కర రావు స్మారక సాహితీ పురస్కారం కోసం నిర్వహించిన విమర్శా గ్రంథాల పోటీలో బండారు రాజ్ కుమార్ " తెలంగాణ కవి ముద్ర" ఎంపికైంది.

14/12/2025 ఆదివారం ఉదయం హన్మకొండ లో నిర్వహించు సమావేశం లో గ్రంథం రచయిత రాజ్ కుమార్‌కు రూ॥ 5000/- నగదు, జ్ఞాపిక, శాలువ తో పురస్కారం ప్రదానం జరుగుతుంది.

సమావేశంలో ముఖ్య అతిథిగా ప్రముఖ సాహితీ వేత్త డా॥ కాలువ మల్లయ్య గౌరవ అతిథులు గా అరసం రాష్ట్ర నాయకులు డా॥పల్లేరు వీరస్వామి,రాపోలు సుదర్శన్, నిధి(బ్రహ్మచారి), వాసిరెడ్డి కృష్ణారావు గార్లు పాల్గొంటారని అరసం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బూర భిక్షపతి డా॥ మార్క శంకరనారాయణ గారలు ప్రకటించారు.

## కామారెడ్డిలో వెలుగుల వేకువ పుస్తకాన్ని ఆవిష్కరించిన గఫూర్ శిక్షక్



పుస్తకావిష్కరణలో అతిథులు.

హైదరాబాద్, డిసంబర్ 3:కవి గాండ్ల నర్సింలు రాసిన పద్య సంపుటి వెలుగుల వేకువ పుస్తకాన్ని తేదీ 29 నవంబర్ కామారెడ్డి లోని బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన తెలుగు భాషా ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశంలో తెలుగు భాష ఉపాధ్యాయులతో కలిసి తెరవే కామారెడ్డి జిల్లా అధ్యక్షులు ప్రముఖ కవి రచయిత గాయకులు గఫూర్ శిక్షక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజిక రుగ్మతల నివారణలో రచనలు తోడ్పడతా యన్నారు .కవులు నిత్య చైతన్య వంతులుగా ఉండాలని , సమాజాన్ని నిత్యం అధ్యయనం చేయాలన్నారు. ఈ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలోవిశిష్ట అతిథులుగా ప్రముఖ కవయిత్రి కాంప్లెక్స్ సెక్రటరీ రిసోర్స్ పర్సన్ వెంకన్న గారి జ్యోతి ఈ పుస్తకాన్ని సమీక్షిస్తూ ప్రేమ ,అనుబంధాలు ఆత్మీయతలతో పాటు నైతిక విలువలను పెంపొందించే విధంగా ఈ పుస్తకంలో అనేక పద్యాలు ఉన్నాయన్నారు.

మరో విశిష్ట అతిథి కాంప్లెక్స్ బాధ్యులు జిల్లా రిసోర్స్ పర్సన్ కవి రచయిత అమరేశం ప్రసాద్ మాట్లాడుతూ వెలుగుల వేకువ పుస్తకంలోని పద్యాలు వెలుగులను పంచుతున్నాయని ఈ పుస్తకంలోని పద్యాలు సామాజిక సమస్యలపై ఎక్కుపెట్టిన అస్త్రాలుగా ఉన్నాయన్నారు.

పుస్తక రచయిత గాండ్ల నర్సింలు మాట్లాడుతూ తెలుగు పండితున్ని కావడం వల్ల పద్యాల పై ఆసక్తిని పెంచుకొని ఈ పుస్తకాన్ని రాశానని భవిష్యత్తులో సామాజిక సమస్యలపై మరెన్నో పద్యాలు రాసి పుస్తకాలను సమాజానికి అందిస్తానని అన్నారు.

అనంతరం తెలుగు భాష ఉపాధ్యాయులందరూ కలిసి కవి గాండ్ల నర్సింలును సన్మానించారు . ఈ కార్యక్రమంలో తెలుగు భాష ఉపాధ్యాయులు కవులు పాల్గొన్నారు.

## గురువులను మర్చిపోకుండా సత్కరించుకోవాలి



శ్రీరంగాచార్యకు తెలుగు వర్సిటీ విశిష్ట పురస్కారతో సత్కరిస్తున్న డా॥కె.వి.రమణాచారి, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, ఆచార్య కోట్ల హనుమంతరావు, ఆచార్య రాధాసారంగపాణి

హైదరాబాద్, డిసంబర్ 3: విద్యతో పాటుజీవనమార్గదర్శకం చేసిన గురువులను మర్చి పోకుండా గుర్తుంచుకొని సందర్భోచితంగా సత్కరించుకోవాలని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి అన్నారు. తెలుగు భాషా సాహిత్యాల వికాసమే లక్ష్యంగా ఏర్పడిన సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వ విద్యాలయం 40వ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళ వారం నాంపల్లిలోని ప్రాంగణం లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 2024 సంవత్సరానికిగాను తెలుగు వర్సిటీ విశిష్ట పురస్కారాన్ని సాహిత్య రంగంలో విశేష కృషి చేసిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ శ్రీరంగాచార్యకు ప్రదానం చేశారు. శ్రీరంగాచార్యకు పురస్కారంగా లక్షరూపాయల నగదు, ప్రశంసా పత్రం, ప్రత్యేక జ్ఞాపికను అందజేసి సత్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన డా॥కె.వి. రమణాచారి ప్రసంగిస్తూ నల్గొండ జిల్లా చందుపట్ల గ్రామంలో జన్మించిన శ్రీరంగాచార్య విశేష గ్రంథ రచనలు చేశారని అన్నారు. మహబూబ్ నగర్ పాలెం ప్రాచ్య కళాశాలలో అధ్యాపకులుగా రాణించి విద్యార్థులను సాహిత్య రంగంలో లబ్ద ప్రతిష్టులను చేసిన గొప్ప సాహితీమూర్తి అని కొనియాడారు. తెలుగు భాషా పరిరక్షకుడిగా సాహిత్య కృషి చేస్తానని శ్రీరంగా చార్య అన్నారు. ఓయూ తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు, విస్తరణ సేవా విభాగం ఇన్‌చార్జి ఆచార్య రాధాసారంగపాణి పాల్గొన్నారు.



ఒంగోలులో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జరిగిన సభలో డా. పాతూరి అన్న పూర్ణను మాడభూషి సాహిత్య పురస్కారం తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో విక్రమ సింహపురి ఉపకులపతి డాక్టర్ అల్లం శ్రీనివాసులు డా.గంగిశెట్టి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com